
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

శుక్రవారం 30 మే 2025



హెచ్ఎంల కౌన్సెలింగ్‌లో మాట్లాడుతున్న అనంత డీఈఓ ప్రసాద్‌బాబు

గందరగోళంగా మొదలై..!

- ప్రశాంతంగా ముగిసిన కౌన్సెలింగ్
- 145 హెచ్ఎం పోస్టుల భర్తీ
- వెలుతురు లేక రాత్రి అవస్థలు

అనంతపురం విద్య, మే 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్ల ప్రక్రియ గురువారం గందరగోళంగా మొదలై ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని జడ్పీ, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లోని స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి కల్పించి.. హెచ్ఎం పోస్టులను భర్తీ చేశారు. రెండు రోజుల కిందట సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించగా, గురువారం ప్లేస్, పోస్టింగ్ కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. 145 పోస్టులకు 1:3 చొప్పున కౌన్సెలింగ్‌కు పిలిచారు. మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభించాల్సి ఉండగా... రోస్టర్ ఖాళీలపై వివాదం నేపథ్యంలో ఆలస్యమైంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి టీచర్లకు ఎదురుచూపులు తప్పలేదు. ఎట్టకేలకు రాత్రి 7 గంటల నుంచి హడావుడిగా కౌన్సెలింగ్ ప్రారంభించారు.

వాగ్వాదం.. పోలీసుల ఎంట్రీ

ఎస్సీ, ఎస్టీ టీచర్లకు ప్రమోషన్లలో అన్యాయం చేస్తే సహించేది లేదంటూ కౌన్సెలింగ్ సమయంలో కొందరు సంఘాల నాయకులు, హెచ్ఎంలు, ఎంఈఓలు ఆందోళనకు దిగారు. ముఖ్యంగా అడిక్వసీ (మిగతా 7లో..)



సెల్‌ఫోన్ వెలుతురులో అగచాట్లు

రేపే పింఛన్ల పంపిణీ

పుట్టపర్తిటౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జూన్ నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం ఓ ప్రకటనలో అధికారులను ఆదేశించారు. జిల్లాలో 2,61,517 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.114.42 కోట్లు శనివారమే పంపిణీ చేయనున్నారు. ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పింఛన్ల పంపిణీ తొలిరోజే 95శాతంపైబడి పూర్తి చేయాలని ఆదేశించారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే మరుసటిరోజున పంపిణీ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

అర్ధరాత్రి కిడ్నాప్ కలకలం

హిందూపురం, మే 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పులమతి రోడ్డు గంగమ్మ గుడి ప్రాంతానికి బుధవారం అర్ధరాత్రి రెండు వాహనాల్లో వచ్చిన కొత్త వ్యక్తులు రవి అనే వ్యక్తిని తీసుకెళ్లారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు ఎవరో వచ్చి కిడ్నాప్ చేశారంటూ చుట్టుపక్కలవారికి చెప్పారు. తీసుకెళ్లింది ఎవరని తెలుసుకునేందుకు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. అయితే వచ్చిన వాహన నంబర్లు స్థానిక పోలీసులకు చెప్పడంతో వారు ఆరా తీశారు. కర్ణాటకలోని గుడిబండ స్టేషన్ పోలీసులు ఇక్కడికి వచ్చి ద్విచక్రవాహనాల చోరీకి సంబంధించిన కేసులో విచారణ కోసం అతన్ని తీసుకెళ్లినట్లు లోకల్ పోలీసులకు సమాచారం అందింది. ఇదేవిషయాన్ని రాత్రిపూట గస్తీ తిరుగుతున్న పోలీసులు అక్కడ గుమిగూడిన జనాలకు చెప్పడంతో వారంతా ఊపిరిపీల్చుకున్నారు.



కొక్కంటిక్రాస్ నర్సరీలో వదిలేసిన పైరు

ముక్కలు..!

కొనేవారు లేక పాడైపోతున్న మొక్కలు



నష్టాలతో పంట సాగుకు

ముందుకు రాని రైతులు

- నారును నర్సరీల్లోనే వదిలేస్తున్న నిర్వాహకులు
- కొక్కంటి క్రాస్‌లోనే రూ.రెండు కోట్లు నష్టం
- నష్టాల ఊబిలో నర్సరీ యజమానులు

తనకల్లు, మే29(ఆంధ్రజ్యోతి): కొనేవారు లేకపోవడంతో నర్సరీల్లో సాగు చేసిన మొక్కలను వదిలేయాల్సి వస్తోందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో లక్షల రూపాయల నష్టం వస్తోందని వాపోతున్నారు. ఇటీవల కాలంలో నర్సరీల్లో పెంచిన మొక్కలనే తెచ్చి సాగు చేసే రైతుల సంఖ్య బాగా పెరిగింది. దీంతో చాలామంది నర్సరీలను ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని ఒక కొక్కంటిక్రాస్ సమీపంలోనే 70కిపైగా నర్సరీలు ఏర్పాటు చేశారు.

లీజు భూముల్లో...

నర్సరీల నిర్వాహకులకు చాలామందికి సొంత భూమి లేకపోవడంతో యజమానుల నుంచి లీజుకు తీసుకుంటున్నారు. వ్యాపారం లాభసాటిగా ఉండటంతో ఇబ్బందులు లేకుండా సాగేది. ప్రతి ఏటా మే, జూన్ నెలల్లో వర్షాలు పడినప్పుడు నర్సరీల్లోని మొక్కల కోసం రైతులు పోటీ పడేవారు. అయితే ఈ ఏడాది మే నెల ప్రారంభంలోనే అధిక వర్షాలు పడ్డాయి. నేటికి పడుతూనే ఉన్నాయి. అయితే నర్సరీల్లోని మొక్కలను కొనుగోలు చేయడానికి రైతులెవరూ ముందుకు రావడం లేదు. దీంతో నర్సరీల్లో పెంచిన(సాగు) పైర్లను అలాగే వదిలేయాల్సి వస్తోంది. ఈకారణంగా కొక్కంటి క్రాస్‌లోనే ఈయేడాది ఖరీఫ్‌లో టమోట, వంగ, మిరప మొక్కల్లో రూ.రెండుకోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు నర్సరీ యజమానులు చెబుతున్నారు.

227మందికి లైసెన్సులు

ఉద్యాన అధికారుల గణాంకాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 227మంది నర్సరీ యజమానులు ఉద్యాన శాఖ ద్వారా లైసెన్సులు పొందారు. ఎంతోమంది లైసెన్సులు (మిగతా 6లో..)

కాలువపై నిర్మాణాలు

గొడవలకు ఆజ్యం పోస్తున్న వైనం



డీఎల్ రోడ్డులో ఇంటిపై దాడి నేపథ్యంలో పెచ్చులూడిన దృశ్యం

సోమందేపల్లి, మే 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డీఎల్ రోడ్డులో మురుగు కాలువలపై చేపట్టిన నిర్మాణాలు గొడవలకు దారితీస్తున్నాయి. ఇటీవల కొందరు కాలువపై ప్రహరీ, అరుగు, మెట్లు, బాత్రూమ్‌ల నిర్మాణం చేపట్టారు. వీటి వల్లే గొడవలు జరుగుతున్నాయి. గడిచిన ఆరు నెలల్లో ఇలాంటి సంఘటనలు అనేకంగా జరిగాయి. బుధవారం ఆర్ఎంపీ కృష్ణమోహన్ అరుగు మెట్లను ఓ యువకుడు మద్యం మత్తులో ధ్వంసం చేయడానికి ప్రయత్నించాడు. దీన్ని అడ్డుకునే ప్రయత్నంలో ఘర్షణ జరగడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు కృష్ణమోహన్ తెలిపారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో, ఎంపీడీఓ వెంకటలక్ష్మికి ఫిర్యాదు చేశారు. 2024 నవంబరులో కూడా తన ఇంటిపై దాడి చేసిన ఘటనలో అప్పట్లో ఆర్డీఓ, తహసీల్దార్, పంచాయతీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తనపై కొంతమంది కక్ష కట్టి తాను ఇంట్లో లేని సమయంలో దాడులకు పాల్పడినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. డీఎల్ రోడ్డులో సమస్యపై గతంలో శివనగర్ అయ్యప్పస్వామి ఆలయంలో మండలపూజ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి సవితకు స్థానికులు ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఆమె సమస్య పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. రాజకీయ నాయకుల జోక్యం అధికంగా ఉండటంతో అధికారులు సమస్యను పరిష్కరించడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీనిపై ఎంపీడీఓ వెంకటలక్ష్మిని వివరణ కోరగా ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులుకు ఆదేశాలు జారీ చేశామన్నారు. వారు డీఎల్ రోడ్డులో పర్యటించి నివేదిక ఇవ్వగానే ఆక్రమణపై చర్యలు తీసుకుంటామన్నారు.

ముందుగా మేల్కోండి..!

- త్వరలో విద్యా సంవత్సరం ఆరంభం
- అవసరమైన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి
- హడావుడి కన్నా ముందస్తే మేలు అంటున్న అధికారులు (6లో...)

పీఎంజేఏవై పటిష్టంగా అమలు చేయాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎంజేఏవై (ఆయుష్మాన్ భారత్ యోజన) పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మినీకాన్ఫరెన్సు హాల్లో గురువారం డాక్టర్ ఎన్టీయార్ వైద్యసేవ అమలు యూనిట్ జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వైద్యాధికారి ఆధ్వర్యంలో ప్రతి వారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా వైద్యులు, వైద్య సిబ్బందికి జిల్లా వైద్యసేవపై సమీక్షలు నిర్వహించాలన్నారు. వాటి నివేదికలు తనకు అందజేయాలన్నారు. హిందూపురం పట్టణంలోని బాలాజీ ఆసుపత్రి, స్పందన, రాఘవేంద్ర తేజ ఆసుపత్రుల్లో పీఎంజేఏవై సేవలపై సమావేశంలో సమీక్షించారు. కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్యసేవ కో-ఆర్డినేటర్ శ్రీదేవి, డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం, హిందూపురం ఆసుపత్రి డీసీహెచ్ఓ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

పసుపుదళం సందడి

గోరంట్ల, మే 29(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో మహానాడు సందడి నెలకొంది. నియోజకవర్గం నుంచి కడపలో నిర్వహిస్తున్న మహానాడుకు మంత్రి సవిత ఆధ్వర్యంలో భారీగా టీడీపీ కార్యకర్తలు తరలివెళ్లారు. పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి, పరిగి, గోరంట్ల మండలాలనుంచి 170 బస్సులు, 50 కార్లతో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. వీరందరికి గోరంట్ల మండలంలోని జీనవాండ్లపల్లి మారెమ్మ ఆలయం వద్ద అల్పాహారం ఏర్పాటు చేశారు. ఉదయం ఒకేసారి అధిక సంఖ్యలో వాహనాలు ఆగడం, చంద్రబాబు, లోకేశ్, సవిత ఫొటోల ఫ్లెక్సీలతో కార్యకర్తలు సందడి చేయడంతో ఆప్రాంతంలో నూతన ఉత్సాహం నెలకొంది. నూతనంగా ఏర్పాటవుతున్న గ్రీన్‌ఫీల్డు హైవేపై వాహనాలన్ని పార్కింగ్ చేయడం ముచ్చటగొలిపింది. మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, మాజీ కన్వీనర్ సోముశేఖర్ ఆధ్వర్యంలో అల్పాహారం అందించారు.



జీనవాండ్లపల్లి వద్ద మహానాడుకు వెళ్లేవారి సందడి

సత్యం అరెస్టు..!

విదేశీయుడిని మోసగించినట్లు కేసు

- 20న కాదట.. 28న పట్టుకున్నారట..!
- సత్యనారాయణరాజు ఆస్తులు ట్రాన్స్‌ఫర్
- అర్విన్ భార్య సుమతి పేరిట రిజిస్ట్రేషన్
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ముసుగేసి తీసుకెళ్లారా..?
- తమకు తెలియదంటున్న పోలీసుల మాటల్లో నిజమెంత..?



నిందితుడిని అరెస్టు చూపుతున్న డీఎస్పీ విజయ్‌కుమార్

పుట్టపర్తి, మే 29(ఆంధ్రజ్యోతి): విదేశీయుడిని మోసగించాడన్న ఆరోపణలపై పుట్టపర్తి గోకులానికి చెందిన రత్నాకరం సత్యనారాయణరాజును పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 20న పోలీసులు తీసుకెళ్లారని కుటుంబ సభ్యులు అంటున్నా.. అతన్ని ఈ నెల 28న అరెస్టు చేశామని డీఎస్పీ వివరించారు. ఈ అరెస్టు చూపకమునుపు తెరవెనుక పెద్ద తంతంగమే నడిచిట్లు స్పష్టమౌతోంది. రత్నాకరం సత్యనారాయణరాజు పేరిట పుట్టపర్తి, ధర్మవరం, కుణతూరు వద్ద భూములు, స్థలాలు ఉన్నాయి. ఇవి బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ నెల 27, 28 తేదీల్లో అర్విన్ ప్రిన్సెస్ మహీంద్రకర్ భార్య తలారి సుమతి పేరిటి రిజిస్టర్ అయ్యాయి. ధర్మవరం మండలం కుణుతూరు సర్వే నంబర్ 344-1, 344-1ఏలో 19 సెంట్లు, సర్వే నంబరు 511-2లో 1.45 ఎకరాలు ఆమె పేరిట రిజిస్టర్ (డ్యాంకుమెంట్ నంబర్ 1563) అయ్యాయి. పుట్టపర్తి ఆసుపత్రి వద్ద సర్వే నంబర్ 509-లో 67 సెంట్ల స్థలాన్ని కూడా డ్యాంకుమెంట్ నంబర్ 1564 కింద సుమతి పేరిట రిజిస్టర్ చేయించారు. ఇవన్నీ రత్నాకరం సత్యనారాయణరాజు నుంచి అర్విన్ భార్య పేరిట మారిపోయాయి. ఇవే కాకుండా మరో ఐదు చోట్ల భూములు, స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలుస్తోంది. ఈ వివాదం (మిగతా 7లో...)

కొసరి కొసరే వడ్డింపు..!

- టిక్కెట్ కంటే తినుబండారాలే రేటు..
- మార్కెట్ ధరకు రెండింతల వసూలు

సినిమా థియేటర్లలో ప్రేక్షకుల నిలువు దోపిడీ

తూతూమంత్రంగా అధికారుల దాడులు





వేసవి సెలవులు ప్రారంభంలో పట్టణానికి చెందిన నలుగురు సభ్యులు కుటుంబం సినిమా చూడటానికి థియేటర్‌కు వెళ్లారు. ఒక్కొక్కరికి టిక్కెట్ రూ.150చొప్పున రూ.600 తీసుకున్నారు. వాహన పార్కింగ్, విరామ సమయంలో స్నాక్స్, కూల్ డ్రింక్‌కు మరో రూ.400 అయింది. రెండున్నర గంటల సినిమా చూడటానికి మొత్తం రూ.వెయ్యి ఖర్చు చేయాల్సి వచ్చింది. ఇలా సినిమా చూడటానికి థియేటర్‌కు వెళితే నలుగురు సభ్యులున్న ఓ కుటుంబం రూ.వెయ్యి సమర్పించు కోవాల్సిందే. అసలు కంటే కొసరుకే అధిక ధర చెల్లించాల్సి ఉంటుంది.

హిందూపురం, మే 29(ఆంధ్రజ్యోతి): వినోదం కోసం సినిమా థియేటర్‌కు వెళ్లే ప్రేక్షకుడు నిలువు దోపిడీకి గురి అవుతున్నాడు. సినిమా టిక్కెట్ ధర కంటే పాప్‌కార్న్, చిప్స్, కూల్‌డ్రింక్, వాటర్‌బాటిల్ వంటి వాటికే ఎక్కువ చెల్లించాల్సి వస్తోంది. వాహనాల పార్కింగ్‌కు అదనంగా చెల్లించాల్సిందే. సింగిల్ స్క్రీన్ థియేటర్‌లో సినిమా చూడాలంటే నలుగురు సభ్యులున్న ఓ కుటుంబానికి కనీసం రూ.వెయ్యికి తగ్గకుండా ఖర్చవుతుంది. మల్టీప్లెక్స్‌లో అయితే ఈ ఖర్చు మూడింతలకు పైనే. దీంతో సామాన్య జనం కుటుంబంతో కలిసి సినిమా థియేటర్ వైపు చూడాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. పెద్దహీరోల సినిమాలు దసరా, సంక్రాంతి, ఉగాది వంటి పండగల సందర్భాల్లో విడుదల అవుతుంటాయి. వీరి సినిమాలు చూసేందుకు ప్రేక్షకులు సైతం ఉత్సాహం చూపిస్తారు. ఇదే అదునుగా భావించిన థియేటర్ యజమానులు దోచుకుంటున్నారు. రెండున్నర గంటల సినిమా చూసేందుకు ఎంత ఖర్చు పెడతామో సినిమా విరామ సమయంలో పదినిమిషాలకే అంత ఖర్చుచేయాల్సి వస్తుందని ప్రేక్షకులు వాపోతున్నారు. సాధారణంగా పిల్లలు పాప్‌కార్న్, బిస్కెట్, కూల్‌డ్రింక్ వంటివి అడుగుతుంటారు. అయితే థియేటర్‌లో రూ.10విలువచేసే ప్యాకెట్‌ను రూ.30కు అమ్ముతారు. దీంతోపాటు బయట రూ.10చిన్న కూల్‌డ్రింక్ బాటిల్‌ను థియేటర్‌లో రూ.30కు కొనాల్సి వస్తుంది. మల్టిప్లెక్స్‌లో అయితే ఈ ధర రూ.100కు పైనే. రూ.10కి దొరికే కేక్ రూ.20నుంచి రూ.30కి అమ్ముతారు. వెజ్, ఎగ్ పఫ్ ఏకంగా రూ.40నుంచి రూ.50దాకా విక్రయిస్తారు.

సౌకర్యాలు అంతంతమాత్రమే...

థియేటర్‌లో ప్రేక్షకుల నుంచి వసూలు చేసే టికెట్ ధర పక్కనబెడితే వారికి అందుతున్న సౌకర్యాలు చాలా దారుణంగా ఉంటాయి. మరుగుదొడ్లు శుభ్రంగా ఉండవు. తాగునీటి సౌకర్యం ఉండదు. మౌలిక సదుపాయాలు అంతంతమాత్రమే ఉంటాయి. సినిమాకు వెళ్లినప్పుడు వాహనాల పార్కింగ్ ఫీజు వసూలు చేయకూడదు. కానీ తప్పనిసరిగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తారు. దీంతోపాటు కొన్ని థియేటర్లలో జీఎస్టీ పేరుతో అదనంగా వసూలు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో టికెట్ బుక్‌చేసుకుంటే జీఎస్టీ రూపంలో అదనపు బాదుడు చెల్లించాల్సిందే. అదికూడా 18శాతం చెల్లించాలి.

తూతూ మంత్రంగా తనిఖీలు

హిందూపురం, పెనుకొండ, గోరంట్లలో ఉన్న థియేటర్లలో అధికారులు సౌకర్యాలపై తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహిస్తారు. అది కూడా పైస్థాయి అధికారుల నుంచి ఒత్తిడి లేదా థియేటర్‌లో ఏదైనా ప్రమాదం సంభవిస్తే అధికారులు అప్పుడు హడావుడి చేస్తారు. తరచూ తనిఖీలు చేస్తే థియేటర్‌లో సమస్యలు పరిష్కారం అయ్యి, ప్రేక్షకులు నిలువుదోపిడీ కాకుండా చర్యలు తీసుకోవచ్చు. ఇటీవల అధికారులు ప్రేక్షకులు లేని సమయంలో వెళ్లి కొన్ని థియేటర్లు తనిఖీ చేశారు. అలాచేస్తే ప్రేక్షకుల సమస్యలు ఎలా తెలుస్తాయని సినీ అభిమానులు ప్రశ్నిస్తున్నారు.

ఖాళీలతో కబడ్డీ...!

- బదిలీల వేళ జడ్పీలో అక్రమాలు..?
- ఎంపీడీఓ ఖాళీలు చూపని అధికారులు
- కౌన్సెలింగ్ తేదీలను ప్రకటించని సీఈఓ
- అక్రమాలు పునరావృతమౌతాయని అనుమానం



నోటీస్ బోర్డులో ఖాళీలు చూస్తున్న ఉద్యోగులు

అనంతపురం విద్య, మే 29 (ఆంధ్రజ్యోతి): జడ్పీలో బదిలీల ముందు ఖాళీలను కబడ్డీ ఆడేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న వేకెన్సీలను పారదర్శకంగా చూపడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. కొన్ని ఖాళీలను చూపకుండా, రేట్లు కట్టి అడ్డగోలుగా అమ్మేయాలని చూస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ నెల 27వ ఉద్యోగుల నుంచి బదిలీలకు దరఖాస్తులు స్వీకరించారు. 231 మంది దరఖాస్తు చేశారు. వాళ్లకు కౌన్సెలింగ్ ఎప్పుడన్నది ఇప్పటి వరకూ సీఈఓ ప్రకటించలేదు. ఇతర జిల్లాల్లో షెడ్యూల్ ఇచ్చారు. కానీ ఇక్కడ మాత్రం (మిగతా 7లో..)

మీ ఆధారాలు ఇవ్వండి: తహసీల్దార్

హిందూపురం, మే 29(ఆంధ్రజ్యోతి): హిందూపురం పట్టణ పరిధిలో నివసిస్తున్నాం. తమకు ఇంటి స్థలాలు లేవంటూ కొందరు హైకోర్టును కొంతకాలం కిందట ఆశ్రయించారు. వారిలో ఎక్కువమంది కోర్టుకు ఇచ్చిన చిరునామాలో లేరని వీఆర్‌ఓల తనిఖీలో వెల్లడైందని తహసీల్దార్ వెంకటేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. హైకోర్టును ఆశ్రయించిన వారిలో 447మంది ఉన్నారు. వీరు ఇచ్చిన చిరునామా ప్రకారం నెలరోజులుగా తిరిగినా ఎక్కడా అలాంటి వారు లేరని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. హైకోర్టును ఆశ్రయించినవారిలో ఎక్కువశాతం మంది ఇతర ప్రాంతాలకు చెందినవారు ఉన్నట్లు తెలిసింది. ఒకవేళవారు నిజంగా హిందూపురం పట్టణంలో ఉంటే లేదా వేరేచోట ఉన్నా వారి ఆధార్, రేషన్‌కార్డు, విద్యుత్ బిల్లు, ఫోన్‌నంబరు చిరునామా తదితర ఆధారాలతో ఏడు రోజుల్లోపు తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని తహసీల్దార్ కోరారు. అలా సమర్పించకపోతే రికార్డుల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.




సభలో అమ్మాయిల ఉత్సాహం


మహానాడు వేదిక


సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు





మహా జాతర





కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం






మొక్కలు ముక్కలు!


కొక్కంటిక్రాస్ నర్సరీ వద్ద బయట పడేసిన నారు

(5వ పేజీ తరువాయి)

లేకుండా నర్సరీలు నిర్వహిస్తున్నారు. లైసెన్సులు పొందినవారిలో 56మంది మాత్రమే ఇప్పటివరకు రెన్యువల్ చేసుకున్నారు. ఈ ఏడాది రైతులు సాగుచేసిన వంగ, టమాట, మిరప, బీట్రూట్, క్యారెట్, బూడిద గుమ్మడి, దోస, బొప్పాయి తదితర పంటలు ధరలు లేక పొలాల్లోనే వదిలేయాల్సి వచ్చింది. దీంతో వర్షాలు అనుకూలంగా కురుస్తున్నా, భూములు సిద్ధంగా ఉన్నా రైతులు మాత్రం పంటలు సాగుచేయడానికి ముందుకు రావడంలేదు. ఇప్పటికే 20లక్షలకుపైగా మొక్కలు నాటాల్సి ఉండగా, ఒక్క మొక్కకూడా నాటలేదు. టమోటాకు ధర ఉంటే, మండలంలోనే 50లక్షలకు పైగా మొక్కలు అమ్ముడుపోయేవి. ధరలు లేకపోవడం వల్ల టమోటా మొక్కలను కొనుగోలు చేయడానికి రైతులు ముందుకు రావడం లేదు. కొంతమంది రైతులు ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం మొక్కలు కొనుగోలు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వందలాది నర్సరీల్లో పెంచిన లక్షలాది మొక్కలను కొనేవారులేక వదిలివేయాల్సి వచ్చింది. ప్రభుత్వం నర్సరీల నిర్వాహకులను ఆదుకోవాలని కోరుతున్నారు.

అడిగేనాథుడే లేడు: టి.రాజా, నర్సరీ యజమాని, కొక్కంటిక్రాస్



ఈఏడాది ఖరీఫ్‌లో టమోటా, మిరప, వంగ రెండు లక్షలకుపైగా మొక్కలను మే నెలలో విక్రయించడానికి నర్సరీలో పెంపకం చేపట్టాం. వీటి కోసం భూమిని లీజుకు తీసుకుని నర్సరీ ఏర్పాటు చేసి, మొక్కల పెంపకం కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేశాం. మొక్కలు నాటే సమయం మించిపోతున్నా అడిగేనాథుడు లేక బయట పారవేయాల్సి వస్తోంది. రైతులకు ఏ విధమైన మొక్కలు అవసరమవుతాయో తెలుసుకుని ఆ రకరాలనే పెంచుతాం. రైతులు వాటిని కొనుగోలు చేయకపోతే మేము వదిలేయాల్సి వస్తోంది. 25నుంచి 30రోజుల లోపు విక్రయించకపోతే ఎంత నారున్నా బయటపడేయాల్సిందే.

లీజు కూడా చెల్లించలేకున్నాం



భూములు లీజులకు తీసుకుని రూ.వేలాదిగా ఖర్చు చేసి, నర్సరీలు ఏర్పాటు చేసి, మొక్కల పెంపకం చేపట్టాం. నర్సరీలు ఎక్కువ కావడంతో పోటీ పెరిగింది. రైతులకు నమ్మకమున్న చోటే మొక్కలు కొనుగోలు చేస్తారు. రైతుల మీద నమ్మకంతో వారు కోరిన రకాలనే సాగు చేస్తాం. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురుస్తున్నా, సాగు చేయాల్సిన సమయం ఆసన్నమైనా, రైతులు మొక్కలు కొనడానికి ముందుకు రావడం లేదు. సాగు చేసిన పంటలకు ధర లేని కారణంగా నే మొక్కలు కొనడానికి ముందుకు రాలేదు. మా నర్సరీలో ఐదులక్షల టమోటా మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. సమయం దాటిపోతే బయట పడేయాల్సిందే. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులను ఆదుకునే మాదిరిగా నర్సరీ యజమానులను ఆదుకోవాలని కోరారు.

- గంగాధర్, నర్సరీ యజమాని, కొక్కంటిక్రాస్

ముందుగా మేల్కోండి..!

త్వరలో విద్యా సంవత్సరం ఆరంభం

అవసరమైన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

హడావుడి కన్నా ముందస్తే మేలు అంటున్న అధికారులు


చిలమత్తూరు సచివాలయం

చిలమత్తూరు, మే 29(ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరం ఆరంభం అయ్యేలోపు విద్యార్థులు వారి ఉన్నత విద్యా ప్రవేశానికి అవసరమైన సర్టిఫికెట్లు సిద్ధం చేసుకుంటే మంచిదని ఉపాధ్యాయులు, అధ్యాపకులు సూచిస్తున్నారు. సర్టిఫికెట్ల మంజూరులో జాప్యం జరిగితే విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. అందుకే అవసరమైన సర్టిఫికెట్ల కోసం ముందుగానే దరఖాస్తు చేసుకుంటే మేలని చెబుతున్నారు. ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, పాలిటెక్నిక్, ఎంబీఏ, ఎంసీఏ ఇలా ఏ కోర్సులో ప్రవేశానికైనా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పలు సర్టిఫికెట్లు అవసరమవుతాయి. కుల, ఆదాయ, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ వంటి ధ్రువీకరణ పత్రాలు అవసరం ఉంటాయి. ఇంటర్మీడియేట్, డిగ్రీ, ఐటీఐ వంటి కోర్సుల్లో ప్రవేశం పొందే విద్యార్థులు ముందుగానే పత్రాలను సిద్ధం చేసుకోవడం వల్ల ఒత్తిడి లేకుండా నూతన కోర్సుల్లో ప్రవేశం పొందే వీలుంటుంది. అవసరమైన ధ్రువపత్రాల కోసం సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు.

అవసరమైన సర్టిఫికెట్లు ఇవే..

ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియేట్, డిగ్రీ, ఐటిఐ వంటి కోర్సుల్లో ప్రవేశానికి కొందరు విద్యార్థులకు కులం, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ సర్టిఫికెట్లు, ఆదాయం వంటి ధ్రువపత్రాలు అవసరం అవుతాయి. వీటిని పొందాలంటే ఆధార్, రేషన్ కార్డు, విద్యార్హతకు సంబంధించిన జిరాక్సు పత్రాలను జత జేసి సచివాలయాల్లో అందజేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన పత్రాలను సంబంధిత వార్డు, గ్రామ వీఆర్వోలు పరిశీలించి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు అందిస్తారు. ఆర్‌ఐ పరిశీలన పూర్తయ్యాక తహసీల్దార్ లాగిన్‌కు వెళతుంది. తహసీల్దార్ లాగిన్‌లో పరిశీలన చేసి డిజిటల్ సైన్ చేస్తారు. అనంతరం ధ్రువపత్రాలు మంజూరైన సమాచారం మనం ఇచ్చిన మొబైల్‌కు సమాచారం వస్తుంది. తదుపరి మనం దరఖాస్తు చేసుకున్న సచివాలయాలు, మీసేవ కేంద్రాల వద్దకు వెళ్లి పత్రాలను పొందవచ్చు.

అత్యవసరమైనపుడు నిబంధనలు ముందుకు..

సాధారణంగా మండల, గ్రామ స్థాయిలో ధ్రువీకరణ పత్రాలు కావాల్సినప్పుడు కొందరు అధికారులు పని ఒత్తిడో మరే ఇతర కారణంతోనో పత్రాల మంజూరులో జాప్యం చేయడానికి నిబంధనలు ముందుకు తెస్తారు. నిబంధనల ప్రకారం ఆదాయ ధ్రువీకరణ పత్రం మంజూరు చేయడానికి పది రోజుల సమయం ఉంటుంది. కుల, ఆదాయ, నివాసం మూడు కలిగిన ధ్రువపత్రానికైతే 30 రోజుల వ్యవధి ఉంటుంది. తొందరగా సర్టిఫికెట్ అవసరమని ఒత్తిడి తెస్తే అధికారులు సిటిజన్ చార్టలో ఉన్న నిబంధనలు ముందుకు తెస్తూ ఉంటారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా దరఖాస్తు చేసుకోవడం వలన అధికారులు కూడా నిబంధనల ప్రకారం ధ్రువీకరణ పత్రాలు ఇవ్వక తప్పదు.

ఇబ్బందులు ఉంటాయి



అవసరమైన సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు ఇప్పటి నుంచే మీసేవ, సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే మంచిది. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమైనప్పుడు ఒకే సమయంలో వేలమంది విద్యార్థులు ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటారు. దాంతో వాటిని పరిశీలించడానికి ఇబ్బందులు ఎదురవుతాయి. ఒకేసారి వేల సంఖ్యలో దరఖాస్తులు ఆన్‌లైన్లో అప్‌లోడ్ కావడంతో సర్వర్ సమస్య కూడా తలెత్తవచ్చు. ముందుగా దరఖాస్తు చేసుకుంటే దరఖాస్తుల పరిశీలనకు కూడా అధికారులకు అవకాశం ఉంటుంది. దీనిని గుర్తుంచుకొని కావాల్సిన సర్టిఫికెట్ల కోసం ఇప్పటి నుంచే దరఖాస్తు చేసుకుంటే మంచిది. - జగన్నాథం, డీటీ, చిలమత్తూరు

టెన్షన్ ఉండదు



త్వరలో విద్యా సంవత్సరం మొదలవుతోంది. తల్లిదండ్రులు పిల్లలకు సంబంధించిన నివాసం, కులం వంటి ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలి. ఇటీవల పదోతరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన వారు ఉన్నత చదువులకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ తరుణంలో వారికి అన్ని రకాలు సర్టిఫికెట్లు చాలా అవసరం ఉంటుంది. అందుకోసం విద్యార్థులు సర్టిఫికెట్లు కోసం ముందుగానే దరఖాస్తు చేసుకోవడం మంచిది. సకాలంలో సర్టిఫికెట్లు అందితే కళాశాలలకు వెళ్లే విద్యార్థులు హడావుడి పడాల్సిన పని ఉండదు.

- సల్మాన్ రాజ్,
ఎంఈఓ, చిలమత్తూరు

ఆస్పత్రుల్లో భోజన సరఫరాకు టెండర్లు

● 6 వరకు గడువు ● డీసీహెచ్‌ఎస్ రవికుమార్ వెల్లడి

అనంతపురం టౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైద్యవిధాన పరిషత్ పరిధిలోని ప్రభుత్వాస్పత్రుల్లో రోగులు, డ్యూటీ డాక్టర్లకు భోజనం సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవికుమార్ గురువారం తెలిపారు. వైద్యవిధాన పరిషత్ పరిధిలో ఉమ్మడి జిల్లాలో హిందూపురం (జిల్లా ఆస్పత్రి), తాడిపత్రి, గుంతకల్లు, మడకశిర, కదిరి, ధర్మవరం ప్రాంతీయ ఆస్పత్రులు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, గుత్తి, పెనుకొండ, కొనకొండ్ల, శింగనమల, కణేకల్లు, పామిడి, చెన్నేకొత్తపల్లి, తనకల్లు, కొత్తచెరువు,గోరంట్ల, నల్లమాడ, రొళ్ల (సామాజిక ఆరోగ్యకేంద్రా(సీహెచ్‌సీలు)ల్లో భోజన సరఫరాకు టెండర్లు స్వీకరిస్తున్నామన్నారు. ఆసక్తిగలవారు జిల్లా ఆస్పత్రికి రూ.3వేలు, ప్రాంతీయ ఆస్పత్రులకు రూ.2వేలు, సామాజిక ఆరోగ్యకేంద్రాలకు రూ.1000 చొప్పున డీడీ చెల్లించి, దరఖాస్తుకు కలిపి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. జూన్ 6వతేదీలోగా దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందన్నారు.

133 మంది గ్రేడ్-2 హెచ్‌ఎంల బదిలీ

అనంతపురం విద్య, మే 29(ఆంధ్రజ్యోతి): టీచర్ల బదిలీల్లో భాగంగా గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులకు బదిలీ ఉత్తర్వులు గురువారం ఉదయం జారీ అయ్యాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 133 మంది బదిలీ అయ్యారు. జోన్-4 కడప ఆర్జేడీ శామ్యూల్ పేరుతో ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇటీవల జిల్లాలో 191 మంది ప్రధానోపాధ్యాయ బదిలీలకు దరకాస్తు చేసుకున్నారు. 28 మంది తప్పనిసరి, 163 మంది రిక్వెస్టు కింద దరఖాస్తు చేశారు. స్ర్కూటినీ తర్వాత వారికి ఉదయం నుంచే బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా 191 మందిలో 133 మందికి స్థానచలనం కల్పించారు. 58 మందికి అవకాశం దక్కలేదు.

మరో రోజు..!

సూపర్ స్పెషాలిటీలో ఓపీ పెంపు

ఒక్కో విభాగం ఆధ్వర్యంలో మూడు రోజులు సేవలు

2 నుంచి అమలులోకి..


అనంతపురం టౌన్, మే29(ఆంధ్రజ్యోతి): స్థానిక శారదానగర్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఇకపై మూడు రోజులపాటు రోగులకు ఓపీ సేవలు అందించనున్నట్లు సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం డాక్టర్లతో సమీక్షించారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఒక్కో వైద్యవిభాగం వారంలో రెండ్రోజులు మాత్రమే రోగులకు ఓపీ సేవలు అందిస్తోందన్నారు. మరోరోజు అదనంగా ఓపీ సేవలు అందించాలని నిర్ణయించామన్నారు. ఈలెక్కన వారంలో మూడురోజులు ఆయా వైద్య విభాగాలు ఓపీ సేవలు అందిస్తాయన్నారు. జూన్ రెండో తేదీ నుంచి అమలు చేస్తామన్నారు.

కొత్త షెడ్యూల్ మేరకు ఓపీ సేవలు ఇలా..

వైద్య విభాగాలు	ఓపీ నిర్వహణ రోజులు
న్యూరోసర్జరీ, గ్యాస్ట్రో, సీటీవీఎస్	సోమ, గురు, శనివారం
కార్డియాలజీ, న్యూరాలజీ, యూరాలజీ	మంగళ, బుధ, శనివారం
నెఫ్రాలజీ, ఎండోక్రొనాలజీ, పీడియాట్రిక్ సర్జరీ	సోమ, బుధ, శనివారం

విత్తనాలు, ఎరువుల కొరత రాకూడదు

అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలు


మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బుక్కరాయసముద్రం, మే 29(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు, ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని దయ్యాలకుంటపల్లి వద్దనున్న వెంకటాపురం జడ్పీ పాఠశాలలో ఖరీఫ్ సన్నద్ధతపై వ్యవసాయ శాఖ, ఏపీ సీడ్స్, మార్క్‌ఫెడ్ అధికారులతో కలెక్టర్ గురువారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయా మండలాలకు అవసరమైన మేర విత్తనం, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. విత్తనాలు నాణ్యతలేకపోతే వెనక్కివ్వాలని రైతులుకు సూచించారు. ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. రైతు సేవాకేంద్రాల్లో 100శాతం క్యూఆర్ కోడ్ ద్వారా నగదు రైతులు చెల్లించే విధంగా చూడాలన్నారు. విత్తన శుద్ధిని వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఉమా మహేశ్వరమ్మ, ఏపీ సీడ్స్ డీఎం సుబ్బయ్య, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి, ఏఓ శ్యాంసుందర్ రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్

అనంతపురం అర్బన్, మే 29(ఆంధ్రజ్యోతి): విత్తన వేరుశనగ కావాల్సిన రైతుల పేర్లను జిల్లాలోని రైతు సేవాకేంద్రాల్లో శుక్రవారం నుంచి రిజిస్ట్రేషన్ చేసుకుంటామని జేడీఏ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు జిల్లాకు 50,592 క్వింటాళ్ల విత్తన వేరుశనగను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. కే-6, టీసీజీఎస్-1694 రకం విత్తన వేరుశనగ 30 కేజీల బస్తా పూర్తి ధర రూ.2790 కాగా, 40 శాతం సబ్సిడీ పోనూ రైతు వాటాగా రూ.1,674 చెల్లించాలని సూచించారు. కదిరి లేపాక్షి రకం 30 కేజీల బస్తా పూర్తి ధర రూ.2,460 అని, సబ్సిడీ పోనూ రైతు వాటా కింద రూ.1,476 చెల్లించాలని సూచించారు. అర ఎకరా వరకు (30 కేజీ వేరుశనగ బ్యాగ్) ఒక బ్యాగ్, అర ఎకరం నుంచి ఎకరం వరకూ 2 బ్యాగ్‌లు, ఒక ఎకరా నుంచి ఆపైన భూమి ఉన్న రైతులకు 3 బస్తాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీడుతున్న మిస్టరీ

గుర్తుతెలియని శవానికి ఏడాది తర్వాత రీపోస్టుమార్టం

హత్యేనని పోలీసుల నిర్ధారణ...?

ధర్మవరం రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): ఏడాది తర్వాత మిస్టరీ వీడుతోంది. రీ పోస్టుమార్టం నిర్వహించడంతో గుర్తుతెలియని శవం వివరాలు తెలిశాయి. మండలంలోని నాగలూరు వద్ద గత ఏడాది ఏప్రిల్ 23న గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన విషయం తెలిసిందే. అప్పట్లో రూరల్ పోలీసులు గుర్తుతెలియని శవంగా కేసు నమోదు చేశారు. ఇటీవల ఎస్పీ రత్న పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో రూరల్ పోలీసులు గుర్తుతెలియని శవంగా నమోదైన కేసును పరిశీలించారు. ఈ గుర్తు తెలియని శవం ఎవరిదని లోతుగా దర్యాప్తు చేపట్టగా పోతుకుంట గ్రామానికి చెందిన కురుబ మంజునాథ్(33)గా గుర్తించారు. అనుమానం వచ్చిన పోలీసులు సాంకేతికను ఉపయోగించి తమదైన శైలిలో విచారణ చేపట్టారు. ప్రమాదవశాత్తు మంజునాథ్ మృతి చెందలేదని, హత్య చేయబడ్డాడని పోలీసులు కొన్ని కీలక ఆధారాలు సేకరించినట్లు సమాచారం. అందులో భాగంగా ఇప్పటికే పలువురిని విచారించి ఈకేసును ఓ కొలిక్కి తెచ్చినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి గురువారం పట్టణంలోని శ్మశానవాటికలో రూరల్ సీఐ ప్రభాకర్, తహసీల్దార్ నటరాజ, వైద్యప్రొఫెసర్ల సమక్షంలో రీపోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి భార్య, ఆమెకు సంబంధించిన వారిని కూడా పోలీసులు విచారించినట్లు సమాచారం. వివాహేతర సంబంధమే హత్యకు కారణమై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. రీపోస్టుమార్టం ఆధారంగా త్వరలోనే ఈ కేసు మిస్టరీ వీడే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

సందట్లో సడేమియా..!

బదిలీలు, ప్రమోషన్ల వేళ ఏఎస్ఓ పోస్టు భర్తీ

ఆగమేఘాల మీద పోస్టింగ్‌పై విమర్శలు

డీఈఓ ఆఫీస్ ఏఎస్ఓగా శ్రీనివాసులు

ఓ ఎమ్మెల్యే, ఓ ఎమ్మెల్సీ ద్వారా డీఈఓ, ఆర్‌జేడీపై ఒత్తిడి



డీఈఓ వెనుక కూర్చున్న శ్రీనివాసులు

అనంతపురం విద్య, మే 29(ఆంధ్రజ్యోతి): ఒక వైపు బదిలీలు, మరో వైపు ప్రమోషన్లు. ఇంత హడావుడిలోనూ విద్యాశాఖలో వివాదాస్పదమైన ఏఎస్ఓ పోస్టును ఆగమేఘాల మీద భర్తీ చేసినట్లు సమాచారం. ఏఎస్ఓ గా గతంలో పనిచేసిన శ్రీనివాసులునే మళ్లీ నియమించినట్లు విద్యాశాఖ లో చర్చ సాగుతోంది. జిల్లాలో కుప్పలు తెప్పలుగా గణిత స్కూల్ అసిస్టెంట్లు ఉన్నా, వారందరినీ కాదని ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌ను నియమించినట్లు స్పష్టమవుతోంది. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి జిల్లా విద్యాశాఖాధికారి ఈ నియామకం చేసినట్టు సమాచారం. ఆగమేఘాల మీద ఉత్తర్వులు ఇవ్వడంతో ఆయన గురువారం విధుల్లో చేరినట్లు విద్యాశాఖ, ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. గతంలో ఏఎస్ఓగా నాగరాజును నియమించడంతో అప్పట్లో కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో 24 గంటల్లో ఉత్తర్వులు రద్దు చేశారు. మరి ఇప్పుడు ఏం చేస్తారో చూడాలి.

ఉత్తర్వులిచ్చి బయట పెట్టలేదా..?

అనంతపురం జిల్లా విద్యాశాఖలో ఏఎస్ఓ పోస్టు ఖాళీగా ఉంది. అత్యంత కీలకమైన ఈ పోస్టుకు తీవ్రమైన పోటీ ఉంది. దీంతో ఈ పోస్టు భర్తీ వెనుక రాజకీయ ఒత్తిళ్లు కూడా ఉంటాయి. గత ఏడాది డిసెంబరులో ఏఎస్ఓగా నాగరాజును తీసుకోవడంపై విమర్శలు రావడంతో కొందరు సంఘాల నాయకులు ఈ సమస్యను కలెక్టర్, విద్యాశాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ వరకూ తీసుకెళ్లారు. దీంతో ఉత్తర్వులిచ్చిన 24 గంటల్లోనే రద్దు చేశారు. ఆ తర్వాత సుమారు ఆరు మాసాలుగా దీన్ని భర్తీ చేయలేదు. కానీ భర్తీ చేయాలంటూ రాజకీయ ఒత్తిళ్లు అధికారులపై వస్తున్నాయి. నెల రోజులుగా డీఈఓ ప్రసాద్‌బాబుపై ఒక మాజీ మంత్రి, ఎమ్మెల్యేతోపాటు, ఓ ఎమ్మెల్సీ ద్వారా కొందరు సంఘాల నాయకులు తమ వ్యక్తికే ఇవ్వాలంటూ ఒత్తిడి తెచ్చినట్లు విమర్శలు వస్తున్నాయి. డీఈఓతోపాటు, ఆర్‌జేడీపైన కూడా ఒత్తిడి పెంచినట్లు సమాచారం. దీంతో ఉన్నఫలంగా భర్తీ చేసి, ఉత్తర్వులు బయట పెట్టకుండా గోప్యంగా ఉంచారని తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో అర్హులే లేరా?

ఏఎస్ఓ పోస్టు భర్తీ చేసే క్రమంలో ప్రధాన అర్హతగా గణితం సబ్జెక్టు చూస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గణితం స్కూల్ అసిస్టెంట్లు చాలా మంది ఉన్నారు. అయితే ప్రధాన అర్హతలున్న టీచర్లను కాదని ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌తో భర్తీ చేయడం విమర్శలకు తావిస్తోంది. నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి, ఒత్తిళ్లు ఉన్నాయంటూ.... కీలకమైన ఏఎస్ఓ పోస్టులో కూర్చోబెట్టడంపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా నామినేటెడ్ తరహాలో పోస్టును భర్తీ చేయడంపై దుమారం రేగుతోంది.

మొన్న ఇచ్చాం.. నిన్న జాయిన్ అయ్యారు: ప్రసాద్‌బాబు, డీఈఓ

జిల్లా విద్యాశాఖ ఏఎస్ఓగా శ్రీనివాసులును మంగళవారం నియమించాం. ఆయన బుధవారం జాయిన్ అయ్యారు. ఆయన ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్. ఆయనకు డిగ్రీలో స్టాటస్టిక్స్ బ్యాక్ గ్రౌండ్ ఉంది.

సత్యం అరెస్టు..!

(5వ పేజీ తరువాయి)


పుట్టపర్తిలో కలకలం రేపుతోంది.

నమ్మేదెలా..?

రియల్ వ్యాపారంలో పెట్టుబడుల పేరిట రూ.12.50 కోట్లు తీసుకుని మోసగించాడని అమెరికాకు చెందిన అర్విన్ ఫిర్యాదుతో రత్నాకరం సత్యనారాయణ రాజుపై ఈనెల 22న పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని పోలీసులు చెబుతున్నారు. కానీ ఈ నెల 20వ తేదీనే సత్యనారాయణరాజును పుట్టపర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారని అతని కుటుంబ సభ్యులు అంటున్నారు. కొందరు ప్రైవేట్ వ్యక్తులు చిత్రహింసలు పెట్టి, అతని పేరిట ఉన్న విలువైన భూమిని రాయించుకున్నారని అంటున్నారు. ఈ వ్యవహారంలో పుట్టపర్తికి చెందిన కొందరు రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులు, పోలీసుల ప్రమేయం ఉందని ప్రచారం జరుగుతోంది. సత్యనారాయణరాజుకు ముసుగువేసి పలుమార్లు బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తీసుకువెళ్లారని, బలవంతంగా ఆస్తులను రాయించుకున్నారని అతని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. వారం కిందటే పోలీసులు అదుపులో ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెబుతుంటే.. అతను బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఎలా వెళ్లాడనే ప్రశ్న తలెత్తుతోంది. ముసుగువేసి తీసుకువెళ్లడం, బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించడం వెనుక పోలీసుల పాత్రను కొట్టిపారేయలేము. సత్యనారాయణ రాజు కనిపించడం లేదని అతని కుటుంబ సభ్యులు పలుమార్లు పోలీసుల వద్దకు వెళ్లినా స్పందించకపోవడం ఆరోపణలకు బలం చేకూరుస్తోంది.

విలువైన భూములను గుర్తించి..

అర్విన్ ప్రిన్సెస్ మహేంద్రకర్ వద్ద తీసుకున్న డబ్బుతో సత్యనారాయణరాజు పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, హిందూపురం, చెల్లికెర, గోరంట్ల సహా పలు ప్రాంతాల్లో పలు భూములు, స్థలాలను కొనుగోలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. వీటిలో ఎనిమిది చోట్ల సత్యనారాయణరాజు పేరిట ఉన్న విలువైన భూములు, స్థలాలను గుర్తించి, వారం రోజులుగా ప్రైవేట్ వ్యక్తులతో బెదిరించి బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో రూ.కోటికిపైగా చేతులు మారినట్లు సమాచారం. పోలీసులు మాత్రం బుధవారం సాయంత్రం రత్నాకరం సత్యనారాయణరాజును అరెస్టు చేశామని అంటున్నారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ విషయం తమకు తెలియదని బుకాయిస్తున్నారు. తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అంటున్నారు. డ్యాంకుమెట్లను సీజ్ చేశామని పోలీసులు చెబుతున్నా, పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తి చేత రిజిస్ట్రేషన్‌లు ఎలా చేయించారనే ప్రశ్నకు సమాధానం లేదు. ఈ వారం రోజుల్లో బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సత్యనారాయణరాజు ఒక్కరే వచ్చారా..? ముసుగు వేసి తీసుకెళ్లింది ఎవరు? ఇష్టపూర్వకంగా రిజిస్ట్రేషన్లు చేయించారా..? అన్నది తేలాల్సి ఉంది. పోలీసు శాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని లోతుగా దర్యాప్తు చేస్తే తెరవెనుక ఏం జరిగిందన్నది బయటకు వస్తుంది.



సుమతి పేరుతో రిజిస్టర్ అయిన సత్యనారాయణ రాజు ఆస్తి వివరాలు

రూ.12.5 కోట్ల మోసం: డీఎస్పీ

పుట్టపర్తి రూరల్: రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అధిక లాభాలు వస్తాయని విదేశీయుడిని నమ్మించి మోసగించిన కేసులో నిందితుడు సత్యనారాయణ రాజును అరెస్టు చేశామని పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపారు. తన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పట్టణంలోని గోకులానికి చెందిన సత్యనారాయణరాజు అమెరికాకు చెందిన అర్విన్ ఫ్రాన్సిస్ మహేంద్రకర్‌తో పరిచయం పెంచుకుని, పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే లాభాలు వస్తాయని నమ్మించాడని తెలిపారు. అర్విన్‌తో బ్యాంకు లావాదేవీల ద్వారా రూ.12.5 కోట్లు తీసుకున్నాడని, ఆ మొత్తంతో ప్లాట్లు, భూములు కొనుగోలు చేశాడని తెలిపారు. అమెరికా నుంచి వచ్చిన అర్విన్, బ్యాంకు లావాదేవీల ద్వారా పంపిన రూ.8 కోట్లతో కొన్న ఆస్తుల వివరాలను అడిగారని, దీంతో 'నీకు ఏం సంబంధం..? నువ్వు నాకు డబ్బులు ఏమీ ఇవ్వలేదు' అని బుకాయించాడని తెలిపారు. ఆ రూ.8 కోట్లే కాకుండా సత్యనారాయణ తన విలాసాల కోసం, క్రికెట్ బెట్టింగ్‌కు రూ.2.50 కోట్లు, షేర్‌మార్కెట్లో పెట్టుబడులకు రూ.2 కోట్లు తీసుకున్నాడని తెలిపారు. మొత్తంగా అర్విన్ నుంచి రూ.12.5 కోట్ల వరకూ డబ్బులు తీసుకుని మోసగించాడని డీఎస్పీ తెలిపారు. అర్విన్ ఫిర్యాదు మేరకు, ఎస్పీ రత్న ఆదేశాలతో ఈ నెల 22న పుట్టపర్తి అర్బన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశామని, నిందితుడిని ఈ నెల 28న అరెస్టు చేశామని తెలిపారు.

ఖాళీలతో కబడ్డీ...!

(5వ పేజీ తరువాయి)

జడ్పీ అధికారులు గోప్యత పాటిస్తున్నారు. గత ఏడాది ఆఖరి వరకూ హడావుడి చేసి, అర్ధరాత్రి తర్వాత ఉత్తర్వులు ఇచ్చి అక్రమాలకు తెరలేపారు. ఈసారి కూడా అదేలా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై కలెక్టర్ దృష్టి సారించకుంటే సాధారణ ఉద్యోగులకు తిప్పలు తప్పవు.

గోప్యత ఎందుకు?

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జడ్పీ యాజమాన్యం కింద నడిచే ఎంపీడీఓ కార్యాలయాలు, పాఠశాలలు, ఇతర సంస్థల్లో ఖాళీలను జడ్పీ సీఈఓ ప్రకటించారు. కానీ ఎంపీడీఓ వేకెన్సీలు చూపలేదు. రెండు జిల్లాల్లో ఉన్న ఖాళీలు (ఎగ్జిస్టింగ్) 7, అరైజింగ్ వేకెన్సీలు 3(మే 31 నాటికి రిటైర్‌మెంట్) కలిపి మొత్తం 10 ఖాళీలు ఉన్నాయి. వీటిని నోటీస్‌బోర్డులో చూపలేదు. జూనియర్ అసిస్టెంట్ల ఖాళీల చూపడంలో కూడా పారదర్శకత పాటించలేదు. కొన్ని ఖాళీలు చూపకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

జడ్పీ ఉద్యోగుల వివరాలు

జడ్పీ యాజమాన్యంలో రెండు జిల్లాల పరిలోట వందలాది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో ఏవో నుంచి ఆఫీస్ సబార్డినేట్స్ వరకూ కేడర్ స్ట్రెంత్, వర్కింగ్ ఉద్యోగుల వివరాలు ఇలా ఉన్నాయి.

కేడర్	కేడర్ స్ట్రెంత్	వర్కింగ్
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు	74	70
సీనియర్ అసిస్టెంట్లు	120	118
జూనియర్ అసిస్టెంట్లు	243	214
టైపిస్టులు	91	82
రికార్డ్ అసిస్టెంట్లు	206	190
ల్యాబ్ అసిస్టెంట్లు	63	50
లైబ్రరీ అసిస్టెంట్లు	02	01
ఆఫీస్ సబార్డినేట్స్	511	173

కలెక్షన్ బ్యాచ్ నడిపిస్తోందా..?

బదిలీలకు దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. ఇప్పటి వరకూ 231 దరఖాస్తులు వచ్చాయని జడ్పీ అధికారులు చెబుతున్నారు. వాటిని స్క్రూటినీ చేసి, పోస్టింగ్ కోసం కౌన్సెలింగ్ నిర్వహించాలి. కానీ ఇప్పటి వరకూ కౌన్సెలింగ్ తేదీని ప్రకటించలేదు. పొరుగు జిల్లా కర్నూలులో జూన్ 1న కౌన్సెలింగ్ నిర్వహించేలా ఆ జిల్లా సీఈఓ 28వ తేదీనే ఉత్తర్వులిచ్చారు. ఇక్కడ క్లారిటీ ఇవ్వలేదు. గత ఏడాది కూడా ఆఖరి వరకూ హడావుడి చేశారు. అర్ధరాత్రి ఉత్తర్వులు ఇచ్చి అడ్డగోలు వ్యవహారాలకు తెరలేపారు. దగ్గరి ఖాళీలను అమ్మేసి అభాసుపాలయ్యారు. ఈ ఏడాది కూడా బేరసారాలకు పావులు కదుపుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. జడ్పీ ఉన్నతాధికారి చుట్టూ కలెక్షన్ బ్యాచ్ మూగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎంపీడీఓలు, ఏవోలు బదిలీల ప్రక్రియలో సీనియర్ అధికారులు కీలకంగా వ్యహరించడం, ఉన్నతాధికారులకు సూచనలివ్వడం పరిపాటి. కానీ జడ్పీలో మాత్రం ఒక సీనియర్ అసిస్టెంట్ తన కలెక్షన్ బ్యాచ్‌ను వేసుకుని సీనియర్లను రానివ్వకుండా, బదిలీల్లో చక్రం తిప్పుదున్నాడని అంటున్నారు. కలెక్టర్ దృష్టి సారించకుంటే అక్రమాలు పునరావృతమౌతాయని అంటున్నారు.

వైద్యంలో నిర్లక్ష్యం

బాధితుడికి రూ.20 లక్షల పరిహారం

వినియోగదారుల కమిషన్ తీర్పు

అనంతపురం క్రైం, మే 29(ఆంధ్రజ్యోతి): వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించినందుకు బాధితుడికి రూ.20 లక్షల పరిహారం చెల్లించాలని జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పునిచ్చింది. దీంతోపాటు చికిత్స కోసం బాధితుడు చెల్లించిన మొత్తాన్ని వడ్డీతో కలిపి తిరిగి చెల్లించాలని, న్యాయవాది ఖర్చు కింద మరో రూ.5 వేలు చెల్లించాలని ఆదేశించింది. అనంతపురం నగరానికి చెందిన న్యాయవాది సుగుణాకర్ బాబు 2023 ఫిబ్రవరి 27న హైదరాబాద్‌లోని ప్రైడ్ ఆస్పత్రిలో.. డాక్టర్ చైతన్య కొమ్రేవార్ వద్ద మోకాలికి పీఆర్పీ చికిత్స చేయించుకున్నారు. చికిత్స అనంతరం ఆయన మోకాలి కీళ్ల మరింత బాధించాయి. పుండ్లు ఏర్పడటంతో అనేకసార్లు ఆసుపత్రికి తిరగాల్సి వచ్చింది. ప్రాథమికంగా చిన్న ఆపరేషన్‌తో అంతా సరిపోతుందని చెప్పిన వైద్యుడు.. 30 సెంటీమీటర్లు పొడవున కాలు కోసి, పెద్ద శస్త్రచికిత్స చేశారు. అది విఫలం కావడంతో బాధితుడు 2023 ఏప్రిల్‌లో బెంగళూరులోని సెయింట్‌జాన్స్ ఆసుపత్రిలో చేరి మరో మారు శస్త్ర చికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. దీని కోసం రూ.2.5 లక్షలు ఖర్చు పెట్టాడు. ఈ క్రమంలో న్యాయవాద వృత్తికి దూరమయ్యాడు. తనకు జరిగిన నష్టంపై సుగుణాకర్ బాబు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. నోటీసులు అందుకున్న వైద్యుడు, కమిషన్ ఎదుట హాజరై వివరణ ఇచ్చుకున్నాడు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం వైద్య సేవల్లో నిర్లక్ష్యం జరిగినట్లు నిర్ధారణ అయిందని జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యుడు గోపీనాథ్ తీర్మానించారు. బాధితునికి రూ.20 లక్షల పరిహారం, రూ.76,102 వైద్య ఖర్చులు, రూ.5వేలు న్యాయవాది ఖర్చులు చెల్లించాలని డాక్టర్ చైతన్య కొమ్రేవార్‌ను జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత, సభ్యులు గ్రేస్‌మేరీ, గోపీనాథ్ ఆదేశించారు. ఈ మొత్తాన్ని 45 రోజుల్లోగా చెల్లించాలని, లేకపోతే 8శాతం వార్షిక వడ్డీతో కలిపి చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

గందరగోళంగా మొదలై..!



మైక్ సరిగా పనిచేయక వినిపించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్న టీచర్లు



ప్రశాంతంగా ఉండండి అంటూ హెచ్చరిస్తున్న పోలీసులు

(5వ పేజీ తరువాయి)

అమలు చేయాలంటూ డిమాండ్ చేశారు. విద్యాశాఖకు సంబంధం లేని కొందరు సంఘాల నేతల వచ్చి ప్రశ్నిస్తుండటంతో ఇతర టీచర్లు అభ్యంతరం తెలిపారు. మీరెవరని ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య కొంతసేపు వాగ్వాదం జరిగింది. నాయకులు, అధికారుల మధ్య గొడవ ముదరడంతో పోలీసులను పిలిపించారు. పోలీసులు వచ్చాక కౌన్సెలింగ్ కొనసాగింది. జడ్పీలో 120 పోస్టులకు, మున్సిపాలిటీల్లో 20 పోస్టులకు, మున్సిపల్ కార్పొరేషన్‌లో 5 పోస్టులకు 1:3 ప్రకారం అభ్యర్థులను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారు.

చీకట్లతో తిప్పలు

కౌన్సెలింగ్ ప్రాంతంలో లైట్లు సరిగా లేకపోవడంతో టీచర్లకు అవస్థలు తప్పలేదు. మైక్ సరిగా పనిచేయకపోవడం, కూర్చోడానికి సరిపడా కుర్చీలు లేకపోవడం, వెలుతురు లేకపోవడంతో రాత్రి అందరూ అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం ప్రారంభమైన సాయంత్రానికి పూర్తవుతుందనుకున్న కౌన్సెలింగ్ రాత్రి వరకూ కొనసాగింది. సెల్‌ఫోన్ టార్చ్ వెలుగులో ప్రక్రియను ముగించారు.

ఇంటర్మీడియట్‌తో ఉద్యోగాలు

అనంతపురం సెంట్రల్, మే 29(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పూర్తిచేసిన వారికి ఉద్యోగావకాశం కల్పించేలా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చర్యలు చేపట్టింది. ఇంటర్మీడియట్‌లో 75 శాతంపైగా, గణితంలో 60శాతంపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ఐటీ రంగంలో ఉద్యోగం ఇవ్వనున్నారు. గణితం మినహా ఇతర గ్రూపుల్లో 75 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు నాన్-ఐటీ సెక్టార్‌లో ఉద్యోగాలు కల్పించనున్నారు. ఇంటర్వ్యూల్లో సెలెక్ట్ అయిన వారికి ఏడాదిపాటు శిక్షణ, మూడు నెలలు క్లాస్‌రూమ్ ట్రైనింగ్ ఉంటుంది. మరో తొమ్మిది నెలలు చెన్నైలోని హెచ్‌సీఎల్ కంపెనీలో ఇంటర్న్‌షిప్ చేస్తూ నెలకు రూ.10వేల చొప్పున స్టైపండ్ పొందవచ్చు. అనంతరం ఉద్యోగంలోకి చేరిన వారికి రూ.1.70 లక్షల వార్షిక వేతనం చెల్లిస్తారు. https://registrations.hcltechbee.com/ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వారికి కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (క్యాట్) నిర్వహించి, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఆఫర్ లెటర్‌ను అందజేస్తారు.

డిగ్రీ, పీజీకి ఆర్థిక సహకారం..

ఇంటర్మీడియట్‌తోనే ఉద్యోగ జీవితం ప్రారంభించి అక్కడితోనే విద్యార్హత ఆగిపోకుండా డిగ్రీ, పీజీ చేయడానికి ఆర్థిక సహకారం అందిస్తారు. ఉద్యోగం చేస్తూనే ఉన్నత విద్యను అభ్యసించేందుకు హెచ్‌సీఎల్ సంస్థ ప్రోత్సహిస్తుంది. అందుకు ఏఎంఐటీవై, శాస్త్ర, కేఎల్ వర్సిటీలతో అఫిలియేషన్ చేసుకుంది. తద్వారా డిగ్రీలో బీబీఏ, బీకాం, పీజీలో బీసీఏ, ఎంసీఏ, ఎంబీఏ అడ్మిషన్స్ కల్పిస్తుంది. అందుకు హెచ్‌సీఎల్ కంపెనీ ఆర్థికంగా సహకారం అందిస్తుంది.

ఎస్‌డీసీ కేంద్రంలో ఇంటర్వ్యూలు

రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు జేఎన్‌టీయూ క్యాంపస్ ఎదురుగానున్న స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎస్‌డీసీ) కేంద్రంలో హెచ్‌సీఎల్ కంపెనీ ప్రతినిధులు జూన్ 5న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఆసక్తిగల విద్యార్థులు పదోతరగతి, ఇంటర్మీడియట్ మార్కుల జాబితాలు, ఆధార్‌కార్డుతోపాటు రెండు ఫొటోలతో హాజరుకావాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాపరెడ్డి కోరారు. వివరాలకు 7780754278, 8309173344, 7780323850, 9642973350 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలకు నోటిఫికేషన్

అనంతపురం సెంట్రల్, మే 29(ఆంధ్రజ్యోతి): డిగ్రీ ఐదో సెమిస్టర్‌లో ఒక సబ్జెక్టు మిగిలిపోయిన విద్యార్థులకు ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎస్కేయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్(సీఈ) డాక్టర్ లోకేష్ గురువారం ప్రకటనలో తెలిపారు. జూన్ 4వతేదీలోపు రూ.2,200 ఫీజు చెల్లించాలన్నారు. బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీఏ ఐదో సెమిస్టర్‌లో ఒక సబ్జెక్టు మిగిలిపోయిన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. జ్ఞానభూమి పోర్టల్ ద్వారా విద్యార్థులు దరఖాస్తులను కళాశాల లాగిన్ నుంచి అప్‌లోడ్ చేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జూన్ 8న కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జిగా కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, మే 29(ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంకు నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి(చైర్మన్)గా ముంటిమడుగు కేశవరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సహకార ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్‌గా నెట్టెం వెంకటేష్‌ను ప్రకటించి నెల రోజులు గడిచింది. ఏడీసీసీ బ్యాంకుకు ఏడుగురు సభ్యులు, డీసీఎంఎస్‌తోపాటు ఆయా సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలను నియమించాల్సి ఉంది.

చేనేత కార్మికుడి ఆత్మహత్య



ఓబులేసు (ఫైల్)

సోమందేపల్లి, మే 29(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక చేనేత కార్మికుడు ఉప్పర ఓబులేసు(46) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకు న్నాడు. మండలంలోని మారుతీనగర్‌కు చెందిన ఓబులేసు చేతి మగ్గం వేసుకుని జీవనం సాగించేవాడు. మరమగ్గాలు ఏర్పాటు చేసుకునేందుకు ఇటీవల బయటి వ్యక్తుల వద్ద రూ.5లక్షలు అప్పు చేశాడు. కుటుంబ ఖర్చులు, కుమార్తె పెళ్లి కోసం ఇంటిని తాకట్టుపెట్టి మరో రూ.5లక్షలు అప్పు చేశాడు. ఈ అప్పులకు వడ్డీలు పెరిగిపోయాయి. ఇదే సమయంలో రుణదాతల ఒత్తిడి పెరగడం, ఏర్పాటు చేసుకున్న మగ్గంలో ఆశించిన లాభాలు రాకపోవడంతో మనస్తాపం చెందాడు. దీంతో ఇంట్లోనే గురువారం ఉదయం ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య నాగలక్ష్మి, కుమార్తె అమృత, కుమారుడు గణేష్ ఉన్నాడు. కుమార్తెకు వివాహం కాగా కుమారుడు ఇంటర్ పూర్తి చేశాడు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పెనుకొండ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

బైకును ఢీకొట్టిన కారు... రైతు మృతి

క్రాప్ లోన్ రెన్యువల్‌కు వెళ్లి వస్తుండగా ప్రమాదం



గోనుగుంట్ల ప్రతాప్ (ఫైల్)

ధర్మవరంరూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారంపల్లి క్రాస్ సమీపంలో 44వ జాతీయరహదారిపై ద్విచక్రవాహనాన్ని ఓ కారు ఢీకొట్టిన ప్రమాదంలో రైతు మృతి చెందాడు. రూరల్ పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు కనగానపల్లి మండలం చంద్రాచెర్ల గ్రామానికి చెందిన గోనుగుంట్ల ప్రతాప్(55) తన భార్య సుబ్బమ్మతో కలిసి క్రాప్‌లోన్ రెన్యూవల్ కోసం మామిళ్లపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. రెన్యూవల్ ముగించుకుని సాయంత్రం చంద్రాచెర్ల గ్రామానికి ద్విచక్రవాహనంపై భార్యభర్తలు బయల్దేరారు. సీతారంపల్లి క్రాస్ వద్ద బెంగళూరు వైపు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న ఓ కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రతాప్, సుబ్బమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు అనంతపురంలోని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి ప్రతాప్ మృతి చెందినట్లు నిర్ధారించారు. సుబ్బమ్మ చికిత్స పొందుతున్నారు. రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణమైన కారును స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

దీపం అంటుకుని వృద్ధుడి మృతి

రాప్తాడు, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామినేపల్లి సమీపంలో ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద ఉన్న శివాలయం పూజారి మన్నల నరసింహుడు(74) ప్రమాదవశాత్తు దీపము అంటుకుని మృతి చెందాడు. రాప్తాడు సీఐ తెలిపిన మేరకు... రామినేపల్లికి చెందిన మన్నల నరసింహుడు కొన్నేళ్ల నుంచి శివాలయం పూజారిగా ఉండేవాడు. ఆయన కుటుంబ సభ్యులు ప్రతి రోజూ భోజనం తీసుకుని వెళ్లి శివాలయం వద్ద ఉన్న నరసింహుడికి ఇచ్చేవారు. వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా నరసింహుడుకి చూపు మందగించింది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి గర్భగుడి ముఖద్వారం వద్ద నిద్రించాడు. అయితే ఆయన పడుకోవడానికి ఉపయోగించిన అట్టముక్కలు పక్కనే ఉన్న దీపము తగిలి అంటుకున్నాయి. ఈక్రమంలో రగ్గుకు మంటలు వ్యాపించాయి. నరసింహుడు మంటలు ఆర్పుకోవ డానికి ఆలయం ముందున్న ప్లాస్టిక్ డ్రమ్ము వద్దకు వెళ్లి, చేతకాక అక్కడే పడిపోయి మృతి చెందినట్లు ఆనవాళ్లు కనిపించాయి. గురువారం ఉదయం నరసింహుడుకి కుటుంబ సభ్యులు భోజనం ఇచ్చేందుకు వెళ్లగా ఒళ్లు కాలిపోయి విగతజీవిగా పడి ఉన్నాడు. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నరసింహుడు సోదరి పెద్దక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.34వేలు

అనంతపురం రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.34వేలు, కనిష్ఠంగా రూ.4,600, సరాసరి రూ.20వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 741టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

న్యూస్ బాక్స్

రేపు జాబ్‌మేళా

ధర్మవరం, మే 29(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ముసలిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాకు అమెజాన్ వేర్ హౌస్ మేనేజ్‌మెంట్, ఆల్ డీజీ (టెక్నికల్ సపోర్ట్) కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. కావున 2023 నుంచి 2025 మధ్య కాలంలో ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు తమ బయోడేటాతో హాజరుకావాలని కోరారు.

వరుస చోరీలు - కనిపించని పెట్రోలింగ్

కొత్తచెరువు, మే 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల మండల కేంద్రంలో వరుస చోరీలు జరుగుతున్నాయి. దీంతో ఇళ్లకు తాళాలు వేసి శుభ కార్యాలయాలకు, ఆస్పత్రులకు వెళ్లాలన్నా ప్రజలు జంకుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నేరాలను అరికట్టాలన్న ఉద్దేశంతో ప్రతి గ్రామానికి ఒక పోలీసును నియమించింది. మండల కేంద్రాల్లో పెట్రోలింగ్ నిర్వహించే విధంగా చర్యలు చేపట్టింది. పోలీసులు గ్రామాల్లో పర్యటించకుండా... పెట్రోలింగ్ నిర్వహించకుండా స్టేషన్‌కే పరిమితమవుతున్నారు. దీంతో దొంగతనాలు అధికం అవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని.. మండల కేంద్రమైన కొత్తచెరువులోనే ఇలా వరుస చోరీలు జరుగుతుంటే ఇక మారుమూల గ్రామాల పరిస్థితి ఏమిటో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. అంతే కాకుండా ఆకతాయిలు విచ్చలవిడిగా బహిరంగ ప్రదేశాల్లోనే మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాని, గ్రామాల్లో నేరాలు, గొడవలు అధికమవుతున్నాయని, పోలీసులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

కంటి ఆస్పత్రి తనిఖీ



మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ గౌతమ్

ధర్మవరం, మే 29(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీచెన్నకేశవపురంలోని లయన్స్ కంటి ఆస్పత్రిని నెల్లూరుకు చెందిన లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ గౌతమి గురువారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో కంటికి సంబంధించిన వైద్యసేవలు సక్రమంగా అందుతున్నాయా, పనితీరు బాగుందా తదితర వాటిపై ఆరాతీశారు. ఆయన వెంట లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకుడు పిట్టా వెంకటస్వామి, ప్రెసిడెంట్ వేణుగోపాలాచార్యులు, సెక్రటరీ రమేశ్‌బాబు, నాగేంద్ర, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు గోసే రాధాక్రిష్ణ, పల్లెం వేణుగోపాల్, నాగరాజు, ఉట్టి ప్రసాద్ ఉన్నారు.

మండలానికి చేరిన విత్తన వేరుశనగ

తనకల్లు, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని తనకల్లు, కోటపల్లి, మల్లిరెడ్డిపల్లి, ఈతోడు, బొంతలపల్లి, తవళం, వివిధ రైతు సేవా కేంద్రాలకు 700 క్వింటాళ్ల విత్తన వేరుశనగ గురువారం చేరింది. తనకల్లుకు చేరిన కాయలను రైతులు, రైతు సంఘం నాయకులు పరిశీలించారు. మండలానికి 6,800 క్వింటాళ్ల కాయలు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ప్రభుత్వం 3,157 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలను మంజూరు చేసిందని ఏఓ శ్రీహరినాయక్ తెలిపారు. అందులో భాగంగా 700 క్వింటాళ్లు అందాయి. మిగిలిన విత్తన కాయలు రెండు, మూడు రోజుల్లో మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలకు చేరనున్నట్లు ఏఓ తెలిపారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

ఓబుళదేవరచెరువు, మే 29(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటసాయి ఐటీఐలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఎంప్లాయ్‌మెంట్, సిరాప్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఈమేళాకు పది కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 74 మంది నిరుద్యోగులు హాజరుకాగా 39 మంది వివిధ కంపెనీలకు ఎంపికైనట్లు ఐకేపీ ఏపీఎం రవీంద్ర, ప్రతినిధి శైలజా తెలిపారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ అంజనేయులు, ఏపీ సిల్క్‌డవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్లేస్‌మెంట్ అధికారి తేజకుమార్ రెడ్డి, సిరాప్ డీపీటీ నారాయణస్వామి, జేసీఓలు అంజనేయులు, శైలజా, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

గాండ్లపెంట, మే 29(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని డీఎల్‌పీఓ ఆంజనప్ప గురువారం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులు, సీఐటీయూ నాయకులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పది రోజులుగా పారిశుధ్య కార్మికులు బకాయి జీతాలు చెల్లించాలని ధర్నా చేస్తున్నారని, దీనిపై ఆయా పంచాయతీ కార్యదర్శులతో చర్చించి, వారికి జీతాలు, పనిముట్లు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమస్యలు పరిష్కారం కావడంతో కార్మికులు దీక్ష విమరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సునీత, పంచాయతీ కార్యదర్శులు, సీఐటీయూ జిల్లా కోశాధికారి సాంబశివ, బాబ్‌జాన్, రైతు సంఘం నాయకులు రాజారెడ్డి, పారిశుధ్య కార్మికులు అక్కులప్ప, ఆంజనేయులు, కదిరప్ప, దొడ్డెప్ప, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

పుట్టపర్తిరూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి కట్టడి, లింగవివక్షపై మునిసిపల్ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో వైద్యసిబ్బంది గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సామాజిక వైద్య ఆరోగ్య అధికారి నగేష్, డీటీసీ సూపర్‌వైజర్ అబిద్‌బాషా గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఇందులో సూపర్‌వైజర్ రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

ధర్మవరం, మే 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జట్కా స్టాండ్ స్థలాన్ని తమకే కేటాయించాలని, తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని జట్కా పుల్లర్స్ అసోషియేషన్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం వారు స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబును కోరారు. వారి సమస్యలను ఆయన మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సంబంధిత శాఖ అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.



హరీశ్‌బాబుకు సమస్యలు వివరిస్తున్న సభ్యులు

గాడిలో విద్యావ్యవస్థ..!

- స్కూళ్లు తెరిచిన రోజే పాఠ్యపుస్తకాలు
- ఇప్పటికే మండలానికి చేరిన వైనం
- సెమిస్టర్ విధానంతో తగ్గనున్న పుస్తకాల బరువు
- ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు





మండల స్టాక్‌పాయింట్‌కు చేరిన పుస్తకాలు

కదిరి అర్బన్, మే 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం పాలనలో అస్తవ్యస్తంగా తయారైన విద్యావ్యవస్థను గాడిలో పెట్టేలా నూతన ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా రానున్న విద్యా సంవత్సరంలో బడులు ప్రారంభమైన రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందేలా చర్యలు చేపట్టింది. ఇప్పటికే మండల స్థాయి స్టాక్ పాయింట్లకు పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, బూట్లు, బెల్టులు.. ఇతర విద్యాసామగ్రి నాణ్యత లేకపోడంతో కొన్నిరోజులకే పాడైపోయాయి. అవి కూడా సకాలంలో అందేవి కావు. దీంతో విద్యార్థులు అనేక రకాలుగా ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యాశాఖపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా పగడ్బందీగా వాటి పంపిణీ కి చర్యలు చేపట్టింది. సర్వేపల్లి రాధాక్రిష్ణన్ విద్యార్థి మిత్ర పేరుతో కిట్లు పంపిణీ చేయనుంది. జిల్లాలో 2,062 పాఠశాలల్లోని 1,36,933 మంది విద్యార్థులకు జూన్ 12న పాఠశాలలు ప్రారంభమైన రోజే పుస్తకాలను అందజేయనుంది.

● విద్యార్థులకు తగ్గనున్న భారం:
విద్యా సంస్కరణలల్లో భాగంగా విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గేలే నూతన ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా యేడాదికి రెండు సెమిష్టర్ల విధానాన్ని తీసుకొచ్చింది. 1 నుంచి 10 వరకు సెమిస్టర్ విధానంలోనే పాఠ్యపుస్తకాలు రూపొందించారు. దీంతో పుస్తకాల బరువు తగ్గనుంది. 1, 2 తరగతులకు సెమిస్టర్‌కు రెండేసి పుస్తకాలుండేలా ప్రణాళికలు రూపొందించారు. 1, 2 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు, గణితం పాఠ్యాంశాలు ఒకే పుస్తకంలో అందించనున్నారు. 3,4,5 తరగతులకు తెలుగు, ఇంగ్లీషు ఒక పుస్తకం, గణితం, పరిసరాల విజ్ఞానం, మరో పుస్తకంలో ఉన్నాయి. అందుకు అనుగుణంగా వర్కుపుస్తకాలు తయారు చేశారు. 6,7, 8,9 తరగతుల్లో తెలుగు, హిందీ, ఇంగ్లీషు ఒక పుస్తకంగా, 8,9 తరగతులకు జీవశాస్త్రం, బౌతిక, రసాయనిక శాస్త్రాలను కలసి ఒకే పుస్తకంగా తీసుకొచ్చారు. సాంఘిక శాస్త్రంలో భౌగోళిక, చరిత్ర, ఆర్థిక, పౌర శాస్త్రాలు కలిసి ఒక పుస్తకంగా ముద్రించారు. 10వ తరగతిలో సెమిష్టర్ విధానంతో ఆక్స్‌ఫర్ డిక్షరీని అందించనున్నారు.

● నిరంతర పర్యవేక్షణ
పాఠ్యపుస్తకాల పంపిణీపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు. మండల స్థాయిలో ఎంఈఓ -2, మండల ఇంజనీర్, లేదా డేటా ఎంట్రీ ఆరేటర్‌ను కలిపి మండల కమిటీని ఏర్పాటు చేశారు. పుస్తకాల పంపిణీ బాధ్యతలు కమిటీకి అప్పగించారు. ఎంఈఓ-1 వాటిని సరిచూసుకుని, యాప్‌లో అప్‌లోడ్ చేయడం, పాఠశాలలకు చేర్చడం, రోజువారి నివేదికలు రూపొందించడం తదితర బాధ్యతలు నిర్వర్తించేలా చర్యలు తీసుకున్నాం.

పుస్తకాలు సిద్ధం

ప్రభుత్వం నుంచి వచ్చిన పాఠ్యపుస్తకాలు మండల స్థాయిలో స్టాక్‌పాయింట్లకు చేర్చాం. వారం రోజుల్లో విద్యా కిట్లు వస్తాయి.



ఈసారి పలు సబ్జెక్టులను కలపడంతో విద్యార్థులకు మోత భారం తగ్గనుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలు తెరచిన రోజునే విద్యా ర్థులకు పుస్తకాలందించే ఏర్పాట్లు చేస్తున్నాం.

-అబ్దుల్‌మాలిక్, సీఎంఓ, సమగ్రశిక్ష

మహానాడుకు భారీగా తరలిన టీడీపీ శ్రేణులు

కదిరి, మే 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కడపలో నిర్వహిస్తున్న మహానాడుకు కదిరి నియోజకవర్గం నుంచి నుంచి వేలాది మంది టీడీపీ శ్రేణులు గురువారం తరలివెళ్లారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి 250కిపైగా బస్సులను ఏర్పాటు చేశారు. ఇవేకాకుండా పలువురు నాయకులు, కార్యకర్తలు సొంతవాహనాలు, ఇతర ప్రైవేటు వాహనాల్లోనూ తరలివెళ్లారు. వేంపల్లి వద్ద ఈ నియోజకవర్గానికి సంబంధించిన టీడీపీ శ్రేణులకు దాదాపు పదివేల మందికి ఎమ్మెల్యే భోజన ఏర్పాట్లు చేయించారు.

● పుట్టపర్తి నుంచి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో 185 వాహనాల్లో కార్యకర్తలు తరలివెళ్లారు. అలాగే ధర్మవరం, కొత్తచెరువు, నల్లమాడ, గాండ్లపెంట, అమడగూరు, ఓడీసీ, నల్లచెరువు, ఎన్పీకుంట మండలంలోని పి.కొత్తపల్లి నుంచి, తనకల్లు మండలంలోని కోర్తికోట నుంచి భారీసంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.



కదిరి: కడప మహానాడు సభాస్థలి వద్ద ఎమ్మెల్యే కందికుంట



ధర్మవరం : మహానాడుకు తరలివెళ్తున్న తెలుగు మహిళలు



పుట్టపర్తి: పెద్దకమ్మవారిపల్లి నుంచి బయలుదేరిన టీడీపీ కార్యకర్తలు



రోడ్డు పనులు అడ్డుకుంటున్న రైతులు

పరిహారం పెంచిన తర్వాతే పనులు చేపట్టండి

ముదిగుబ్బ, మే 29(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి జాతీయ రహదారి(342) విస్తరణలో భూములు కోల్పోయిన రైతులు పరిహారం పెంచిన తర్వాతే పనులు చేపట్టాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు నాలుగవ రోజైన గురువారమూ రోడ్డు పనులను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ముదిగుబ్బ తహసీల్దార్ నారాయణస్వామి ఆ రైతులను తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు. జిల్లా అధికారులతో మాట్లాడి.. న్యాయమైన పరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. అందుకు రైతులు అంగీకరించలేదు. గ్రామసభలు కూడా నిర్వహించకుండా, పరిహారం ఎంత ఇస్తారో తెలపకుండా పనులు ఎలా చేపట్టారని ప్రశ్నించారు. పరిహారం ఎంత ఇస్తారో తేల్చాలని, ఆ తర్వాతే పనులు చేపట్టాలని తేల్చిచెప్పారు.

డీఎంహెచ్‌ఓపై ఆరోపణలు తగదు

కదిరిఅర్బన్, మే 29(ఆంధ్రజ్యోతి): డీఎంహెచ్‌ఓ ఫిరోజాబేగంపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం తగదని ఏపీ తెలుగునాడు మెడికల్ అండ్‌హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాజశేఖర్, సురేంద్రనాయక్, నరేంద్రరెడ్డి గురువారం ఓ ప్రకటనలో హితవుపలికారు. కూటమి ప్రభుత్వం అర్హత, సీనియార్టీతో పారదర్శకంగా నియామకాలు చేపడుతోందన్నారు. ఉన్నత స్థాయిలో ఉన్న మహిళ ఉద్యోగి పట్ల ఇలా నిరాధార ఆరోపణలు చేసి, వారి మానసిక సైర్యాన్ని దెబ్బతీయడం సరికాదన్నారు. యూనియన్ సమస్యలను ఆమె పరిష్కరించారన్నారు.

జనన, మరణ రికార్డుల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న అధికారి

పుట్టపర్తి, మే 29(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జనన, మరణ రిజిస్ట్రేషన్ల రికార్డులను జనన-మరణ రిజిస్ట్రేషన్ల జిల్లా అదనపు గణాంక అధికారి గురురాజేంద్రప్రసాద్ గురువారం తనిఖీ చేశారు. లోపాలు లేకుండా జనన మరణాల నమోదు చేయాలని, సర్టిఫికెట్‌లను ప్రజలకు సులభతరంగా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, సహాయ గణాంక అధికారి కెంపుల సూర్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-పోస్ యంత్రాల పరిశీలన

నంబులపూలకుంట, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌకదాన్యపు డీలర్ల వద్ద ఉన్న ఈపోస్ యంత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో తూనికలు, కొలతల అధికారులు గురువారం తనిఖీ చేశారు. గత ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు వాహనాల ద్వారా నిత్యావసర వస్తువులు సరఫరా చేసేవారు. జూన్ 1 నుంచి డీలర్లే నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో డీలర్ల వద్ద ఉన్న ఈపోస్ యంత్రాలను పరిశీలించినట్లు తూనికలు, కొలతల శాఖ సిబ్బంది ప్రకాష్, శ్రీకాంత్ తెలిపారు.

కాలువల్లో పూడికతీత

ధర్మవరం, మే 29(ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పె ట్టుకొని.. పట్టణంలోని ప్రధాన కాలువల్లో పూడికతీత పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. ఈ పనులను మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీశ్‌బాబు పరిశీలించారు. వారివెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ శామ్సన్ ఉన్నారు.

ఆర్డీటీపై ఆంక్షలు తొలగించాలి

తనకల్లు, మే 29(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి విదేశీ నిధులు అందకుండా విధించిన ఆక్షలను కేంద్ర ప్రభుత్వం తొలగించాలని మండలంలోని బత్తినవారిపల్లి వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వెనుకబడిన దళిత, గిరిజన, కులాలకు సేవలందిస్తున్న ఆర్డీటీ సంస్థ ఎఫ్‌సీఆర్‌ఏను కేంద్రం పునరుద్ధరించడానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బత్తినవారిపల్లి సీపీఎం నాయకులు శివన్న, గ్రామస్థులు పాల్గొన్నారు.

● కదిరి : ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు పలు జిల్లాలో పేదలకు సేవలదిస్తున్న ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏను పునరుద్దురించాలని తలుపులలో గురువారం ర్యాలీ నిర్వహించారు. వివిధ ప్రాంతల నుంచి వచ్చిన ఆర్డీటీ లబ్ధిదారులు మండల కేంద్రంలో ఈ ర్యాలీ చేపట్టారు.



తనకల్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్థులు



తలుపులలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్థులు



రోడ్డు ఎత్తు పెంచేందుకు కొలతలు తీస్తున్న అధికారులు

మురుగునీరు తొలగింపునకు చర్యలు

ధర్మవరం రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపల్లి గ్రామంలో రహదారిపై మురుగునీరు నిల్వ ఉంటుండంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై గురువారం ఆంధ్రజ్యోతి ఓ కథనాన్ని ప్రచురించింది. దీనికి ఎంపీడీఓ సాయిమనోహర్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు రెడ్డమ్మ, చరిత, వీఆర్‌ఓ సందీప్, మహిళ పోలీస్ దివ్య, ఏఎన్ఎం లక్ష్మీనరసమ్మ ఆ గ్రామానికి చేరుకొని.. మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ రోడ్డు ఎత్తు పెంచేలా కొలతలు తీసుకున్నారు. అదేవిధంగా నీరు నిల్వ లేకుండా పక్కనే కాలువ తీయించేలా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

1బి అడంగళ్ సమస్య పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ముదిగుబ్బ, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులకు 1బి, అడంగళ్ సమస్య ఉందని, దాన్ని వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ నారాయణ స్వామికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకుడు ఆటో పెద్దన్న మాట్లాడుతూ... బ్యాంకుల్లోని వ్యవసాయ రుణాలకు 1బితో పాటు అడంగళ్‌ను బ్యాంకు అధికారులు అడుగుతున్నారని, వాటిని మంజూరు చేయడంలో రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఈ ఖరీఫ్ సీజన్లో వందలాది మంది రైతులు బ్యాంకుల్లో భూములను తాకట్టుపెట్టి రుణాలు తీసుకున్నారని, వాటిని కోసం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బండల వెంకటేష్, ఆవాజ్ కమిటీ ప్రధాన కార్యదర్శి బాబ్జాన్, రఫీ, బాబు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయండి



సంత ప్రాంతంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

అమడగూరు (కదిరి), మే 29(ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలంలోని మహమ్మబాద్ వారపు సంతను రోడ్డు పక్కన నిర్వహిస్తున్నారు. అయితే అక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె లేకపోవడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారపు సంతకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వస్తుంటారని, అంతేకాకుండా పిల్లలు ఎక్కువగా సంచరిస్తుంటారని, ఆ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. విద్యుత్ లైన్‌కు ఆనుకుని ఏపుగా పెరిగిన చెట్టు ఉందని, ఆ తీగలకు చెట్టు తగులుతూ ఉండటంతో ప్రమాదం పొంచి ఉందని, అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతిభావంత విద్యార్థులకు పురస్కారాలు



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న కమిటీ సభ్యులు

ధర్మవరం, మే 29(ఆంధ్రజ్యోతి): గత విద్యాసంవత్సరంలో టెన్త్, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన కురుబ విద్యార్థులకు ప్రతిభా పురష్కారాలను స్థానిక యశోదమ్మ వకీలు పెద్దయ్య కురుబ కల్యాణ మండపంలో గురువారం అందజేశారు. కల్యాణ మండప కమిటీ అధ్యక్షుడు మాలగుండ్ల మల్లికార్జున మాట్లాడుతూ.. కల్యాణమండపం ద్వారా వచ్చే ఆదాయంతో టెన్త్, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఇలా ప్రతిభా పురష్కారాలు అందిస్తున్నామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లోని విద్యార్థులకు వరుసగా రూ.3 వేలు, రూ.2.5 వేలు, రూ.2 వేలు ఇవ్వడంతోపాటు దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి రూ. వెయ్యిని ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. ఇందులో మాలగుండ్ల రవీంద్ర కల్యాణ మండప జనరల్ సెక్రటరీ కప్పల బలరాముడు, కోశాధికారి బండి ఉజ్జినప్ప, గౌరవాధ్యక్షుడు బెల్లెనాగప్ప, ఉపాధ్యక్షులు కోటి వెంకటేశ్, గిరకనారాయణస్వామి, గవ్వల నారాయణ స్వామి, గవ్వల సూరిబాబు, బెల్లె యజ్జన్న, జాయింట్ సెక్రటరీ బులగొండ్ల నాగార్జున, డైరెక్టర్లు, కోటి శ్రీనివాసులు, పోతుకుంట రమేష్, గిరక నాగేంద్ర పాల్గొన్నారు.

కదిరి సబ్‌జైలు తనిఖీ



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి

కదిరి లీగల్, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ జైల్‌ను జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఎస్ రాజశేఖర్ గురువారం తనిఖీ చేశారు. సబ్ జైల్‌లో ఉన్నవారికి అందుతున్న ఆహారం, వై ద్యం.. తదితర సదుపాయాలపై ఆరాతీశారు. ఆహారం, సరుకులను పరిశీలించారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రజా న్యాయ స్థానాల ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘం సభ్యులు దశరథ్ నాయక్, రఘునాథ్, జైలు అధికారి వాసుదేవ రెడ్డి పాల్గొన్నారు.

రేపు కౌన్సిల్ సమావేశం

ధర్మవరం, మే 29(ఆంధ్రజ్యోతి): ధర్మవరం మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఉదయం 11.30 గంటలకు కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ప్రమోద్‌కుమార్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలన్నారు.

మహానాడు సందడి

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ




సీఎం చంద్రబాబుతో ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, మే29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గురువారం మహానాడు కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కలిశారు. ముఖ్యమంత్రితో మడకశిరకు సంబంధించిన అభివృద్ధితోపాటు పార్టీ అంశాలపై చర్చించినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో మడకశిర నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున మహానాడుకు తరలివెళ్లారు.

హిందూపురం: మహానాడుకు హిందూపురం నుంచి వెళ్తున్న టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేహనహళ్లి ఆనంద్, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుణాచలరెడ్డి, నాయకులు రంగారెడ్డి, మంగేష్, ఉమాశంకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్ సతీష్, మంజుల, కోరుముట్ల నాగేంద్ర తదితరులు



మహానాడుకు తరలివెళ్తున్న నాయకులతో శ్రీనివాసరావు



మహానాడు వేదిక వద్ద హిందూపురం మున్సిపల్ చైర్మన్ తదితరులు

హిందూపురం(రొద్దం): మహానాడుకు రొద్దం నుంచి తరలి వెళ్తున్న టీడీపీ నాయకులు మాధవనాయుడు, చంద్రమౌళి, చిన్నప్పయ్య, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి వీరాంజనేయులు తదితరులు



సోమందేపల్లి: మహానాడుకు వెళ్లిన సోమందేపల్లి నాయకులు వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆంజనేయులు, నీరుగంటి చంద్ర, కన్వీనర్ వెంకటేశులు, సిద్దలింగప్ప, సూరి, సిద్దప్ప తదితరులు



పెనుకొండరూరల్: మహానాడులో గురువారం బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవితను జిల్లా అధికార ప్రతినిధి రఘువీరా, కోనాపురం రామలింగం తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.



మహానాడుకు తరలివెళ్తున్న మండల కన్వీనర్ ఈశ్వర్‌ప్రసాద్, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు లక్ష్మీనారాయణరెడ్డి, పోతిరెడ్డి, రామకృష్ణ తదితరులు



కౌన్సిల్ మీట్ వాయిదా

పెనుకొండ, మే 29(ఆంధ్రజ్యోతి): పెనుకొండ నగర పంచాయతీకి సంబంధించి గురువారం జరగాల్సిన నగర పంచాయతీ సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని అనివార్య కారణాలవల్ల వాయిదా వేసినట్లు కమిషనర్ సతీష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్‌మీట్ నిర్వహణ తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

షిర్డీసాయి మందిరంలో ప్రత్యేక పూజలు

పెనుకొండ, మే 29(ఆంధ్రజ్యోతి): దక్షిణ షిర్డీగా పేరుగాంచిన పెనుకొండ మండలంలోని షిర్డీసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు సురేష్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పూలతో బాబా చిత్రపటాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు.

ఫ్లెక్సీల చించివేత

పరిగి, మే 29(ఆంధ్రజ్యోతి): హిందూపురం, పరిగి ప్రధాన రహదారిలో ఏర్పాటుచేసిన టీడీపీ, జనసేన పార్టీ నాయకులకు చెందిన ఫ్లెక్సీలను బుధవారం రాత్రి శివ చించేశాడంటూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో నాయకుడు ఆంజనేయులు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ రంగడుయాదవ్ తెలిపారు. బిందు నగర్‌లో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను గొరవనహళ్లికిచెందిన శివ చించేశాడంటూ చేసిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



ఫ్లెక్సీలు చించేసిన దృశ్యం

తాళం వేస్తే.. అంతే..

పేట్రేగిపోతున్న దొంగలు

రెండు నెలల్లో ఏడు చోరీలు

ఇళ్లు విడిచి వెళ్లాలంటే జంకుతున్న జనం

చోరీ సొమ్ము రికవరీ చేయాలంటూ పోలీసులకు బాధితుల మొర



పరిగి, మే 29(ఆంధ్రజ్యోతి): రెండు నెలల నుంచి మండలవ్యాప్తంగా దొంగలు హల్‌చల్ చేస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. ఆలయాలు, ఇళ్లలో, బేకరిల్లో, సూపర్‌మార్కెట్లలో దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. కొడిగెనహళ్లి-మోదా రహదారిలో ఉన్న రెండు సూపర్‌మార్కెట్లలో, బేకరీలో చోరీ జరిగింది. బేకరీలో షెట్టర్ తాళాలు పగలకొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. విద్యానగర్‌లో ఓ కుటుంబం ఇంటికి తాళంవేసి విహారయాత్రకు వెళ్లగా అదునుచూసుకున్న దొంగలు తలుపులు పగలకొట్టి ఇంట్లోకి చొరబడి 30తులాల బంగారం, రూ.40వేలు నగదు దొంగలించారు. ఈ చోరీ మరువకముందే గొరవనహళ్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహానికి అలంకరించిన ఆభరణాలు చోరీ చేశారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు అరకిలోమీటరు దూరంలో ఉన్న ఇందిరమ్మ కాలనీలో ఓ రైతు అన్నకుమార్తె పెళ్లికోసం వెళ్లగా దొంగలు ఇంట్లో చొరబడి బంగారం, నగదు దొంగలించారు. బాలిరెడ్డిపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హుండీ పగలకొట్టి రూ.13వేలు నదును శాసనకోట గ్రామానికి చెందిన ఇరువురు వ్యక్తులు దొంగలించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈవిధంగా మండలంలో ఎక్కడబడితే అక్కడ చోరీలు జరుగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వైద్యం కోసంకానీ, విహారయాత్రకు గాని వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఇంటికి తాళం వేసి వెళ్లాలంటే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా మండల పరిధిలో ఆర్థికంగా, ఉద్యోగరీత్యా ఎక్కువశాతం ఉన్న కొడిగెనహళ్లి, సేవామందిరం గ్రామాలనే దొంగలు టార్గెట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. రాత్రిపూట పోలీసులు గస్తీ ముమ్మరం చేసి తమకు భద్రత కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. చోరీ జరిగిన సొమ్మును రికవరీ చేసి అందించాలని బాధితులు పోలీసులను కోరుతున్నారు.

గస్తీ ముమ్మరం చేస్తాం: రంగడుయాదవ్, ఎస్ఐ

రాత్రి సమయాల్లో గస్తీని ముమ్మరం చేస్తాం. ప్రధాన రహదారిలో మెరుగైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తాం. మూడు రోజులపాటు యాత్రలు, వైద్యం నిమిత్తం వెళితే పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలి. రాత్రి సమయాల్లో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

ఆగిన జగనన్న సర్వేరాళ్ల తయారీ కేంద్రం

ప్రజాధనం వృథా అంటూ విమర్శలు



నిలిచిపోయిన సర్వేరాళ్ల తయారీ కేంద్రం

మడకశిర రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో వైఎస్ఆర్ జననన్న భూరక్ష పథకం ద్వారా భూములు రీ సర్వే చేశారు. ఈ నేపథ్యంలో వైఎస్ఆర్ జగనన్న భూరక్ష పేరుతో సర్వేరాళ్లను తయారుచేసి వాటిని సర్వేచేసిన భూముల సరిహద్దుల్లో నాటారు. దూర ప్రాంత నుంచి సర్వేరాళ్ల తీసుకురావడానికి అనేక ఇబ్బందులు ఎదురవ్వడంతో మండంలోని కల్లుమర్రి పంచాయతీ తడకలపల్లి గ్రామ సమీపంలో గనులశాఖ ఆధ్వర్యంలో దాదాపు రూ.5 కోట్లతో సర్వేరాళ్ల తయారీ కేంద్ర ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. పనులు కూడా కొంత మేరకు జరిగాయి. సర్వే చేసిన రైతు భూముల్లో వైఎస్ఆర్ జననన్న భూరక్ష పేరుతో ఉన్న సర్వేరాళ్ల నాటడంతో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో నాటిన రాళ్లను రైతులు తొలగించారు. దీంతో వైఎస్ఆర్ జననన్న భూరక్ష సర్వే నిలిచిపోయింది. ఇంతలోనే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో నిర్మాణంలో ఉన్న సర్వేరాళ్ల తయారీ కేంద్ర పనులు ఆగిపోయాయి. వైసీపీ ప్రభుత్వం ప్రజాధనం నిరుపయోగం చేసిందని ప్రజలు విమర్శిస్తున్నారు.

మురుగునీటితో నిండిన కాలువలు

పరిగి, మే29(ఆంధ్రజ్యోతి): మోదాగేట్‌లోని దళిత కాలనీలో స్వల్ప వర్షానికే మురుగు కాలువలు పొంగి పొర్లుతున్నాయి. గతంలో కురిసిన భారీ వర్షాలకు ఈ కాలువలు నిండి 50శాతం ఇళ్లలో నీరు చేరాయి. నామమాత్రంగా అప్పట్లో మురుగు కాలువలు శుభ్రంచేసి వదిలేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మురుగు కాలువలు నిండిగా ఉండటంతో ఎక్కడ మురుగునీరు ఇళ్లలోకి వస్తుందోనన్న భయాందోళనకు కాలనీవాసులు గురవుతున్నారు. ఈ విషయమై పంచాయతీకార్యదర్శి రమేష్‌ను వివరణ కోరగా మురుగునీటి కాలువలకు మరమ్మతులు చేయించేందుకు నిధుల కొరతతో ఉందని, ప్రస్తుతం చేయించలేమన్నారు.



నిండుగా ఉన్న మురుగు కాలువ

రెండు టిప్పర్లు సీజ్



పోలీసులు సీజ్ చేసిన టిప్పర్లు

పరిగి, మే 29(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను బుధవారం రాత్రి పోలీసులు సీజ్ చేశారు. పైడేటి నుంచి శిర, కొడికొండ హైవేలో ఉన్న పెట్రోల్‌బంక్‌కు ప్రభుత్వ అనుమతులు పొందకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు సమాచారం అందించగా వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రెండు టిప్పర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు.

పాఠశాలలు పునఃప్రారంభం

పావగడ, మే 29(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగియడంతో పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో పాఠశాలలకు పచ్చని తోరణాలు కట్టి వచ్చిన విద్యార్థులకు బీఈఓ ఇంద్రాణమ్మ స్వీట్లను పంచారు.

తల్లిదండ్రులకు బాలికల అప్పగింత

పెనుకొండ టౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఇద్దరు బాలికలు రెండు రోజుల క్రితం అదృశ్యమయ్యారు. గురువారం వారి తల్లిదండ్రులకు వారిని పోలీసులు అప్పజెప్పారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు అందించిన వివరాల మేరకు షేక్ రియాజ్, నూర్జహాన్ దంపతుల కుమార్తెలు తహసీన్, ఫిర్దోస్ అదృశ్యమైనట్లు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారించిన పోలీసులు అనంతపురంలోని ఓ లేడీస్ వర్కింగ్ హాస్టల్‌లో ఉన్నారని తెలిసి వెంటనే వారిని పెనుకొండకు తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పజెప్పారు. తల్లి మందలించడంతో వీరు అదృశ్యమైనట్లు విచారణలో తెలిసిందని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతుకు గాయాలు

మడకశిర టౌన్, మే29(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో రైతు గాయపడ్డాడు. పట్టణంలోని స్టేట్‌బ్యాంకు వద్ద పంట రుణం రెన్యువల్‌కు మండల పరిధిలోని తురకవాండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు కురుబ రామాంజనేయులు నడుచుకుంటూ వస్తున్నాడు. ఆ సమయంలో ద్విచక్రవాహనం ఢీకొనడంతో రైతుకు గాయాలయ్యాయి. వెంటనే అతడిని మడకశిర ఆస్పత్రికి తరలించారు.

ఎన్టీఆర్ స్మారక పురస్కారం అందుకున్న కోగిర

పెనుకొండ, మే 29(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రముఖ హాస్యనటుడు కోగిర జయచంద్రారెడ్డి ఎన్టీఆర్ స్మారక పురస్కారాన్ని అందుకున్నారు. బుధవారం అనంతపురంలోని శ్రీకృష్ణ కళామందిరంలో ఎన్టీరామారావు 102వ జయంతి పురస్కరించుకుని అనంతపురం డీఆర్ఓ మలోల చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.

కారులో బంగారు చైను, నగదు చోరీ

గోరంట్ల, మే29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మయ్యగారిపల్లి సమీపంలోని హిందూపురం రహదారి వద్ద కారులోని నగదు, బంగారు, వస్తువులు బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు యజమాని షర్ఫుద్దీన్ తెలిపారు. షర్ఫుద్దీన్ గుజిరీ దుకాణంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తి పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి షర్ఫుద్దీన్ అనారోగ్యానికి గురై చికిత్సకోసం తన కారులో కాకుండా వాహనంలో వెళ్లాడు. చికిత్స అనంతరం రాత్రి 9.30గంటలకు దుకాణం వద్దకు రాగా కారు అద్దాలు పగలగొట్టడం గమనించాడు. రూ.లక్ష నగదు, తులం బంగారు చైన్, రూ.15వేల విలువ చేసే రాగి వస్తువులు చోరీ అయ్యాయి. దుకాణంలో పనిచేస్తున్న ఉత్తర్‌ప్రదేశ్ వాసి కనిపించకపోవడం, ఫోన్ పనిచేయకపోవడంతో అతడిపైనే అనుమానం ఉన్నట్లు షర్ఫుద్దీన్ తెలిపారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడిగా బాబావలి



హిందూపురం, మే 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థి సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా బాబావలిని ఎన్నుకున్నట్లు పీడీఎస్‌యూ నాయకులు గురువారం ప్రకటనలో తెలిపారు. హిందూపురంలో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయనతోపాటు 22మందిని జిల్లా కమిటీ సభ్యులుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్ష స్థానం ఇచ్చినందుకు విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు.

తూకాలు సక్రమంగా వేయండి



సూచనలిస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

పెనుకొండ టౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే రేషన్ షాపుల్లో తూకాలు సక్రమంగా వేయాలని తూనికలు, కొలతలశాఖాధికారి కనకరత్నమ్మ ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ దుకాణాలకు చెందిన వేయింగ్ మిషన్లను తనిఖీచేసి సీల్ వేశారు. కార్యక్రమంలో స్టోర్ డీలర్లు, తూనికలు కొలతలశాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలతో ఆటలొద్దు: డిప్యూటీ రిజిస్ట్రార్



వివరాలు తెలుసుకుంటున్న డీఆర్ శ్రీకాంత్

పావగడ, మే 29(ఆంధ్రజ్యోతి): సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలతో ఆటలు వద్దని, విధులను సక్రమంగా నిర్వర్తించాలని డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీకాంత్ సబ్ రిజిస్ట్రార్ రాధమ్మకు సూచించారు. మూడు రోజుల క్రితం రైతు సంఘం నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు సబ్‌రిజిస్ట్రార్ రాధమ్మ అవినీతిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గురువారం తుంకూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీకాంత్ పావగడ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. విషయం తెలుసుకున్న రైతుసంఘం నాయకులు, స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు కార్యాలయానికి చేరుకుని మరోమారు రాధమ్మ అవినీతిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాధమ్మను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. వారి ఫిర్యాదును స్వీకరించిన ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని వారికి తెలిపారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షులు పూజారప్ప, గోవిందప్ప డీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి: సీఐ

అగళి, మే 29(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సీఐ రాజకుమార్ తెలిపారు. అగళి మండలంలో గురువారం ఆకస్మికంగా పర్యటించారు. మండలం కర్ణాటకకు సరిహద్దులో ఉందని, కర్ణాటక మద్యం, ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్ఐ వీరేష్‌కు సూచించారు. ఆలూడి, నందరాజనపల్లి చెక్‌పోస్టుల వద్ద పూర్తిస్థాయిలో బందోబస్తు ఉండాలన్నారు.

స్థల వివాదంలో 13 మందిపై కేసు నమోదు

గోరంట్ల, మే29(ఆంధ్రజ్యోతి): స్థలవివాదానికి సబంధించి 13 మందిపై గురువారం కేసు నమోదుచేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. గోరంట్లకు చెందిన టీడీపీ నాయకుడు ఉమ్మర్‌ఖాన్ స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్నస్థలాన్ని కొనుగోలు చేశారు. తమకు హక్కు ఉందంటూ గోరంట్లకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, మరో 12 మంది ఆ స్థలంలో ప్రవేశించి రాతికూసాలు ధ్వంసంచేసి ఇబ్బంది పెడుతున్నారన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దరఖాస్తుల పరిశీలన

గుడిబండ, మే 29(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాఫూలే బాలికల గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశాల కోసం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినుల నుంచి దరఖాస్తులను గురువారం పరిశీలించారు.

'మా భూమిని ఇప్పించండి'

అమరాపురం, మే 29(ఆంధ్రజ్యోతి): తమ భూమిని తమకు ఇప్పించాలని హేమావతి గ్రామానికి చెందిన దళితులు లక్ష్మమ్మ, మారక్క, సిద్దక్క కోరారు. తమకు చెందిన భూమిని కొందరు అక్రమంగా వారి పేరు మీద పాసుపుస్తకం చేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయంపై దళిత సంఘ నా యకులను వారు కలిశారు. వెంటనే వారి భూమిని వారికి అప్పగించా లని లేనిపక్షంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని మాజీ సర్పంచ్ ప్రసాద్, నారాయణప్ప, తిప్పయ్య హెచ్చరించారు.

ఘనంగా రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



రామలింగేశ్వరస్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ

లేపాక్షి, మే 29(ఆంధ్రజ్యోతి): కంచిసముద్రం గ్రామంలో వెలసిన శ్రీరామలింగేశ్వరస్వామి విగ్రహప్రతిష్ఠ గురువారం ఘనంగా జరిగింది. నూతన విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. రామలింగేశ్వరస్వామి విగ్రహాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ వీరయ్య హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలుచేసి తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'క్రీడలపట్ల ఆసక్తి పెంచుకోవాలి'



విజేత జట్టుతో ముఖ్య అతిథులు

చిలమత్తూరు, మే 29(ఆంధ్రజ్యోతి): యువత క్రీడలపట్ల ఆసక్తి పెంచుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథం, ఎస్ఐ మునీర్ అహమ్మద్ సూచించారు. వీరజవాన్ మురళీనాయక్ జ్ఞాపకార్థం కోడూరుకి చెందిన యువకులు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నీ ఫైనల్ మ్యాచ్ గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ వీరజవాన్ జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నీ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రధానంగా యువత బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా ఉండాలన్నారు. విద్యతోపాటు క్రీడలూ ముఖ్యమన్నారు. అనంతరం టోర్నీ విజేతగా నిలిచిన కోడూరు జట్టుకి రూ. 50 వేల నగదు బహుమతి, రన్నర్‌గా నిలిచిన సోమఘట్ట జట్టుకి రూ. 20 వేలను వారు అందజేశారు.

పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం, మే 29(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తున్న 350 మంది మహిళా కార్మికులకు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాసం వద్ద చీరలను పంపిణీ చేశారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని టీడీపీ నాయకుడు మంగేష్ చీరల పంపిణీ, అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్మన్ రమేష్, మాజీ చైర్మన్ అనిల్‌కుమార్, వాల్మీకి కార్పొరేషన్ బేవనహళ్లి ఆనంద్, నాయకులు ప్రెస్ వెంకటేశ్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, బాబాఖాన్, అంజి, మహేష్, వెంకటేశ్‌రెడ్డి, టీడీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షులు శివశంకర్, ఆర్ఎంఎస్ షఫీ, రోషన్‌బాబు, బండారు బాలాజీ, అయూబ్, ఇర్షాద్ పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

రొళ్ల, మే 29(ఆంధ్రజ్యోతి): నాటిక ద్వారా హెచ్ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించారు. సామాజిక ఆరోగ్యకేంద్రం రొళ్ల, ఫోర్డ్ సంస్థ, ఐసీటీసీ ఆధ్వర్యంలో గురువారం అనిల్‌కుమార్ కళాబృందంతో వీధి నాటకం ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహనను బస్టాండు ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ బాల ప్రణీత్‌రెడ్డి, ఫోర్డ్ ఆర్గనైజేషన్ పీడీ బదిరీష్, అంజినప్ప, ల్యాబ్ టెక్నీషియన్ రమణనాయక్, ప్రాజెక్ట్ మేనేజర్ అశ్వర్థనారాయణ, హెడ్ కానిస్టేబుల్ రామలింగప్ప, ఓఆర్‌డబ్ల్యులు అనిత, గీత, రంగలక్ష్మి, కళాబృందం రమేష్, రమ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపుతున్న రైతు చెన్నకేశవులు

గోరంట్ల, మే29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పులేరు రహదారిలో పెద్ద ఈదులవంకలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని సామగ్రిని గురువారం తెల్లవారుజామున చోరీచేశారు. సర్వేనెంబర్ 592-1లోని 1.59 ఎకరాల్లో గోరంట్లకు చెందిన రైతు చెన్నకేశవులు మొక్కజొన్న పంట సాగుచేస్తున్నారు. గుర్తు తెలియన వ్యక్తులు 25హెచ్‌పి సామర్థ్యం ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలకొట్ట అందులోని వైరు, సామగ్రిని ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పంట ఎండిపోయే ప్రమాదముండడంతో అధికారులు స్పందించి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయాలని కోరారు.

ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోండి

మడకశిర టౌన్, మే29(ఆంధ్రజ్యోతి): ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సంస్థ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని నీలకంఠాపురం గ్రామంలో త్వరలో ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన ఆసుపత్రిని ప్రారంభించనున్నారని, అందులో భాగంగా ఉద్యోగాల్లో ఎంపికైన వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. డీగ్రీ, ఇంటర్, ఏఎన్ఎం, జీఎన్ఎంతోపాటు ఐటీఐ చేసిన వారు జూన్ 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 7416417530, 9390683303 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సెల్‌ఫోన్ చోరీ

పెనుకొండ టౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్‌బజార్‌లో ఉన్న సెల్‌ఫోన్ దుకాణంలో సెల్‌ఫోన్ దొంగలించిన సంఘటన గురువారం ఉదయం చోటుచేసుకుంది. షాప్ నిర్వాహకుడు ఉదయం ఇంటి నుంచి సెల్‌ఫోన్ తీసుకొచ్చే సమయంలో ఉన్న సెల్‌ఫోన్ షాపులో పెట్టే సమయంలో లేకపోవడంతో అనుమానం వచ్చి సీసీ ఫుటేజీని పరిశీలించాడు. ఈ క్రమంలో బ్యాగులోంచి సెల్‌ఫోన్ దొంగలించినట్లు గుర్తించారు. వ్యక్తిని గుర్తించి అతడికి ఫోన్‌చేశాడు. మావద్ద సీసీ ఫుటేజ్ ఉందని, పోలీసులకు ఫిర్యాదు చేస్తాననడంతో గోప్యంగా షాపు నిర్వాహకులకు సెల్‌ఫోన్ తెచ్చి ఇచ్చేశాడు. ఈ చోరీకి చేసిన వ్యక్తి పెనుకొండ మండలం ఓ మహిళా ఎంపీటీసీ భర్త అని తెలిసింది.